www.prajanaava.in

ప్రజానావ

Telugu Daily

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: **Hyderabad, Rangareddy, Karimnagar** Circulated to: **Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 69 | శనివారం | 17 అక్టోబర్, 2026

పోటీకి మేం భయపడం



- స్టార్‌లింక్ ప్రవేశాన్ని మేం వ్యతిరేకించడం లేదు
- చట్టాలకు లోబడే ప్రతి సంస్థా పనిచేయాలి
- మస్క్ ఆరోపణలకు రిలయన్స్ దీటైన సమాధానం

7



రామ రామ రామ ఉయ్యాలో..

దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడలో నద్దుల బతుకమ్మ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఎంగిలి పూల బతుకమ్మ పండుగ నుంచి ఏడో రోజున నద్దుల బతుకమ్మ పండగను నిర్వహించడం ఇక్కడ అనాదిగా వస్తున్న ఆచారం. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో బతుకమ్మ ఆటాపాటలతో మార్మోగాయి. బతుకమ్మ ఆటపాటలు ఆడిన మహిళలు వేములవాడ మూలవాగు బతుకమ్మ తెప్ప వద్ద నిమజ్జనం చేశారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమా అగ్రవాల్, ఎస్పీ మహేశ్ బీ గీతే, ప్రముఖ సినీ నటుడు సాయి కుమార్, రామ్ జగన్ లు హాజరయ్యారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆహ్వానం మేరకు వేములవాడలో నద్దుల బతుకమ్మ వేడుకలకు వచ్చినట్లు నటుడు సాయి కుమార్ పేర్కొన్నారు. – ప్రజానావ, వేములవాడ

ప్లాంట్ ఏర్పాటు చేయండి

- హ్యుందాయ్ యాజమాన్యానికి సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- జహీరాబాద్‌లో రూ.8,528 కోట్లతో గ్లోబల్ ఆర్‌అండ్‌డీ కేంద్రం
- పెండింగ్ అనుమతులను వెంటనే పూర్తి చేయాలి



ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణను కార్ల తయారీకి అనువైన ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో హ్యుందాయ్ కార్ల తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ఆ సంస్థ యాజమాన్యాన్ని కోరారు. రాష్ట్రంలో తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు అన్ని రకాల సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. జహీరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న హ్యుందాయ్ గ్లోబల్ ఆర్‌అండ్‌డీ కేంద్రానికి సంబంధించిన పెండింగ్ అనుమతులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ (హెచ్‌ఎంఐఈ) మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యూన్ చో నేతృత్వంలోని ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో శుక్రవారం సమావేశమైంది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, జహీరాబాద్‌లో ప్రతిపాదిత ప్రాజెక్టు పురోగతిపై చర్చించారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫాక్చరింగ్ జోన్ (నిమ్స్)లో రూ.8,528 కోట్ల పెట్టుబడితో హ్యుందాయ్ మోటార్ ఇండియా ఇంజినీరింగ్ ఇంటిగ్రేటెడ్ గ్లోబల్ ఆర్ అండ్ డీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. 678 ఎకరాల్లో విడతలవారీగా అభివృద్ధి చేయనున్న ఈ ప్రాజెక్టు ద్వారా మొత్తం 4,276 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ప్రాజెక్టు పురోగతిని హ్యుందాయ్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. రాబోయే తరువాయి 2లో..

మోదీకి వ్యతిరేకంగా విద్రోహ శక్తుల కుట్రలు

- కాంగ్రెస్‌ది బ్లాక్‌మెయిల్, దిగజారుడు రాజకీయం
- అజిత్ దోవల్ వంటి వారిని రాజకీయాల్లోకి లాగడం దుర్మార్గం
- 'సర్'పై ప్రాథమిక పరిజ్ఞానం లేని రాహుల్
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం



ప్రజానావ, హైదరాబాద్: శ్రీలంకలో ప్రభుత్వాన్ని కూల్చిన మాదిరిగానే భారత్‌లోనూ ఎన్డీయే ప్రభుత్వాన్ని కూల్చేస్తామని రాహుల్ గాంధీ దింపుడు కళ్లం ఆశలు పెట్టుకున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీకి దమ్ముంటే ప్రజాదరణతో ఎన్నికైన మోదీ ప్రభుత్వాన్ని పడగొట్టి చూడావని సవాల్ విసిరారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఎన్నికల నిర్వహణ యావత్ ప్రపంచానికే ఆదర్శమని, స్వతంత్ర వ్యవస్థ అయిన ఎన్నికల కమిషన్‌పై బురద చల్లేందుకు రాహుల్ నిరంతరం యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. దేశ భద్రతను కాపాడుతూ ప్రజల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్‌ను రాజకీయాల్లోకి లాగడం తరువాయి 2లో..



కరువు నివారణలో సీఎం

అట్టర్ ఫ్లాప్

- రేవంత్ అవగాహనా రాహిత్యంతోనే సమస్య
- రైతు కూలీలకు ఏడాదికి రూ.12వేలు ఇవ్వాలి
- పవర్ మ్యాక్స్ కంపెనీతో ఒప్పందం బయటపెట్టాలి
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత

2



రేవంత్ రెడ్డి ఈఎంఐ సీఎం

అధిష్ఠానానికి ఈఎంఐలు కట్టకపోతే పదవి నిలవదు

- విద్యుత్, సాగునీటి సంక్షోభాలకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం
- ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువు
- సంక్షోభాన్ని సృష్టించి బొగ్గు కొంటామంటూ నాటకాలు
- సీఎం హయాంలో జరిగిన అక్రమాలపై న్యాయ విచారణ జరపాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2

41 బార్లకు లక్కీడ్రా పూర్తి

- మొత్తం 8,770 దరఖాస్తులు
- హైదరాబాద్‌లోని 14 బార్ల కోసం 4,251 మంది పోటీ
- జిల్లాల్లోని 27 బార్లకు 4,519 దరఖాస్తులు



2

మోదీకి వ్యతిరేకంగా విద్రోహ శక్తుల కుట్రలు

(మొదటిపేజీ తరువాయి)

అత్యంత దుర్మార్గమని కిషన్ రెడ్డి ఖండించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇంత బాధ్యతారాహిత్యమైన, బలహీనమైన ప్రతిపక్ష నేతను దేశం ఎన్నడూ చూడలేదన్నారు. నాడు వాజ్‌పేయి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు కాంగ్రెస్‌తో విభేదాలు ఉన్నప్పటికీ దేశ ప్రయోజనాల కోసం పీవీ నరసింహారావు ప్రభుత్వ హయాంలో విదేశీ ప్రతినిధి బృందానికి నేతృత్వం వహించిన చారిత్రక సంప్రదాయాన్ని గుర్తుచేశారు. సర్ ప్రక్రియపై రాహుల్ గాంధీకి ప్రాథమిక జ్ఞానం కూడా లేదని, ఇది నెహ్రూ, ఇందిర, రాజీవ్, పీవీ కాలం నుంచే అమల్లో ఉన్న రాజ్యాంగ ప్రక్రియ అని స్పష్టం చేశారు. కేరళలో సీపీఎం లక్షలాది దొంగ ఓట్లను సర్ ద్వారా తొలగించడం వల్లే కాంగ్రెస్ గెలిచిందని ఆ పార్టీ నేతలే ఒప్పుకున్నారని గుర్తుచేశారు.

న్యాయస్థానాలపై ఒత్తిడి, అరాచక రాజకీయాలు

న్యాయస్థానాల ముందుకు కాంగ్రెస్ నేతలు ఊరేగింపుగా వెళ్లడం అత్యంత గర్హనీయమని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ముఖ్యమంత్రులు, ఎంపీలను తరలించి సుప్రీంకోర్టుపై ఒత్తిడి తెచ్చేందుకు, న్యాయమూర్తులను బ్లాక్‌మెయిల్ చేసేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. బారికేడ్లు ఎక్కి డ్యాన్సులు చేయడం, మహిళా పోలీసులపై దురుసుగా ప్రవర్తించడం పట్ల దేశ ప్రజలు ఛీత్కరించుకుంటున్నారన్నారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచకాలు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎండగడుతున్నామని కిషన్ రెడ్డి అన్నారు. ఇందిరా పార్క్ వద్ద ధర్నా చేయాలన్నా, ఫీజు రీయింబర్స్‌మెంట్, జీవో 22ఏ సమస్యలపై పోరాడాలన్నా బీజేపీ కార్యకర్తలను, రాష్ట్ర అధ్యక్షుడిని వారంలో ఐదుసార్లు అర్ధరాత్రి ఇళ్లల్లోకి చొరబడి అక్రమంగా నిర్బంధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో రైతులు ఏడాదిన్నర పాటు నిరసనలు చేపడితే కేంద్రం ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరించిందని, కానీ ఇక్కడ మాత్రం ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని విమర్శించారు. దేశ అభివృద్ధిని, ప్రపంచవ్యాప్తంగా మోదీ నాయకత్వంలో పెరుగుతున్న దేశ ప్రతిష్ఠను జీర్ణించుకోలేక అంతర్జాతీయ పెట్టుబడిదారీ శక్తులు, డీప్ స్టేట్ మీడియా, విదేశీ శక్తులు, దేశీయ విద్రోహ శక్తులు ఏకమై కుట్రకు తెరలేపాయని.. ప్రపంచ శక్తులన్నీ ఏకమైనా మోదీ ప్రభుత్వాన్ని వెంట్రుక కూడా పీకలేవని స్పష్టం చేశారు.

ప్లాంట్ ఏర్పాటు చేయండి

(మొదటిపేజీ తరువాయి)

కొద్ది నెలల్లోనే ఆర్ అండ్ డీ కేంద్రం నిర్మాణానికి భూమి పూజ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రాజెక్టు పనులు వేగంగా ముందుకు సాగేందుకు ప్రభుత్వం సహకరించాలని వారు సీఎంను కోరారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి అవసరమైన అనుమతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ భౌగోళికంగా దేశం మధ్యలో ఉందని, హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కలిగిన నగరమని ముఖ్యమంత్రి తెలిపారు. దేశంలోని ఆరు ప్రధాన మెట్రోపాలిటన్ నగరాలతో పోలిస్తే హైదరాబాద్ సురక్షితమైన, జీవించడానికి అనుకూలమైన కాస్మోపాలిటన్ నగరంగా గుర్తింపు పొందిందన్నారు. కార్ల తయారీ పరిశ్రమకు అవసరమైన రవాణా, మౌలిక సదుపాయాలు తెలంగాణలో అందుబాటులో ఉన్నాయని వివరించారు. రహదారులు, రైలు మార్గాలు, విమానాశ్రయాలతోపాటు భవిష్యత్తులో ఓడరేవులకు హైస్పీడ్ కనెక్టివిటీ కల్పించే ప్రణాళికలు ఉన్నాయని తెలిపారు. ప్రత్యేక మొబిలిటీ క్లస్టర్ల అభివృద్ధితో వాహన తయారీ రంగానికి మరింత ప్రోత్సాహం లభిస్తుందని చెప్పారు. పెరి–అర్బన్ రీజియన్ (ప్యూర్) వంటి ప్రణాళికల ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక విస్తరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, తయారీ రంగంలో పెట్టుబడులకు అనువైన వేదికగా నిలుస్తుందని సీఎం వివరించారు. తెలంగాణకు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో 2024 ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం హ్యుందాయ్ ప్రతినిధులతో చర్చలు జరిపింది. 2025 జూన్‌లో హ్యుందాయ్ ఆరఅండ్‌డీ కేంద్రం ప్రతిపాదనకు మంత్రివర్గ ఉపసంఘం ఆమోదం తెలిపింది. ప్రపంచస్థాయి సౌకర్యాలతో భారీ శాటిలైట్ నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని సీఎం హ్యుందాయ్ ప్రతినిధులకు వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను తెలియజేస్తూ రాబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026కు హాజరుకావాలని సంస్థ యాజమాన్యాన్ని ఆహ్వానించారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ సాంకేతిక, అధునాతన ఇంజినీరింగ్ కేంద్రంగా మరింత బలోపేతం చేయాలన్న హ్యుందాయ్ లక్ష్యం తెలంగాణ రైజింగ్–2047 విజన్‌కు అనుగుణంగా ఉందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యాన్ చో తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి ప్రస్థానంలో తమ సంస్థ భాగస్వామిగా కొనసాగుతుందన్నారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు, ఎక్స్–ఆఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌తో రెండు దశాబ్దాల అనుబంధం

హ్యుందాయ్ సంస్థకు హైదరాబాద్‌తో రెండు దశాబ్దాల అనుబంధం ఉంది. హైటెక్ సిటీలోని కేంద్రం అధునాతన వాహన ఇంజినీరింగ్‌కు మద్దతునిస్తూ కీలక ఆరఅండ్‌డీ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఈ సామర్థ్యాలను మరింత విస్తరించేలా జహీరాబాద్‌లో గ్లోబల్ ఆరఅండ్‌డీ, మెగా టెస్టింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రం ద్వారా వాహనాల రూపకల్పన, పరీక్షలు, పనితీరు, ధ్రువీకరణ, నాణ్యతా ప్రమాణాల పరిశీలనతోపాటు ఇంజినీరింగ్ ప్రక్రియలను మరింత మెరుగుపరిచేందుకు అవకాశం కలగనుంది. హ్యుందాయ్ అధునాతన సాంకేతిక సామర్థ్యాలను బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుంది.

సీఎంకు కావ్య మారన్ వివాహ రిసెప్షన్ ఆహ్వానం

సీఎం రేవంత్ రెడ్డిని సన్ గ్రూప్ చైర్మన్ కళానిధి మారన్ దంపతులు కలిశారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లిన వారు తమ కుమార్తె కావ్య మారన్ వివాహ రిసెప్షన్‌కు హాజరు కావాలని ఆహ్వానించారు. నవంబర్ 21న చెన్నైలో కావ్య మారన్, ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ వివాహ రిసెప్షన్ జరగనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రికను అందజేశారు.

రేవంత్ రెడ్డి ఈఎంఐ సీఎం



ప్రజానావ, హైదరాబాద్: సింగరేణిలో కుంభకోణాలు జరుగుతున్నాయని తాము చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో శనివారం జరిగిన నర్సంపేట నియోజకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి కుంభకోణాలు, ప్రతిపాదిత విదేశీ బొగ్గు కొనుగోళ్ల వ్యవహారంపై దమ్ముంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి హయాంలో జరిగినట్లు తాము ఆరోపిస్తున్న అక్రమాలపైనా న్యాయ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. తాను ఉత్తరం రాస్తే విచారణకు ఆదేశిస్తానని ముఖ్యమంత్రి చెప్పడం కాదని, మీడియా ముందు ప్రకటనలు చేయడం కాక వాస్తవంగా విచారణ జరిపించాలని స్పష్టం చేశారు. సింగరేణిలో తన బామ్మర్ది ప్రమేయంతో జరిగిందని తాము ఆరోపిస్తున్న రూ.10 వేల కోట్ల కుంభకోణంపైనా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో సోలార్ పవర్ కుంభకోణాన్ని కూడా బయటపెడతామన్నారు. గతంలో 70 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసిన సింగరేణిని బలహీనపరిచి, ఇప్పుడు ఆ సంస్థను పక్కనపెట్టి విదేశీ బొగ్గు కొనుగోళ్లకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. ఒకప్పుడు 24 గంటల విద్యుత్ సరఫరాకు అండగా నిలిచిన సింగరేణినే ఇప్పుడు రేవంత్ రెడ్డి బదనాం చేస్తున్నారని విమర్శించారు. సింగరేణిలో టన్ను బొగ్గు సుమారు రూ.3,800కు లభిస్తుంటే విదేశాల నుంచి కొనుగోలు చేస్తే టన్నుకు రూ.10 వేల నుంచి రూ.12 వేల వరకు ఖర్చవుతుందని కేటీఆర్ పేర్కొన్నారు. ఆస్ట్రేలియా నుంచి బొగ్గు కొనుగోళ్ల పేరుతో కమీషన్లు పొందేందుకే ఈ వ్యవహారాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధిష్ఠానానికి 'ఈఎంఐ' లు కట్టకపోతే ముఖ్యమంత్రి పదవి పోతుందనే భయంతోనే విదేశీ బొగ్గు కొనుగోళ్ల వ్యవహారంలో కమీషన్లు సమకూర్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. కాంగ్రెస్‌కు చెల్లించాల్సిన ఈఎంఐలను వసూలు చేసేందుకే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రాష్ట్రంలో ఉన్నారని, రికవరీ ఏజెంట్‌లా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు.

ఉత్పత్తి తగ్గడంతోనే బొగ్గు కొరత

సింగరేణిలో బొగ్గు ఉత్పత్తిని తగ్గించడం వల్లే నేడు విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల వద్ద బొగ్గు కొరత ఏర్పడిందన్నారు. సింగరేణికి చెల్లించాల్సిన సుమారు రూ.60 వేల కోట్ల బకాయిలను పెండింగ్‌లో పెట్టి బొగ్గు సరఫరా చేయడం లేదంటూ సంస్థను బదనాం చేస్తున్నారని విమర్శించారు. విద్యుత్ సరఫరా వ్యవస్థను దెబ్బతీసిన తర్వాత ఇప్పుడు విద్యుత్ కొనుగోలు చేయాలంటే కరెంట్ అందుబాటులో లేదంటూ అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. గతంలో ఛత్తీస్‌గఢ్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంతో విద్యుత్ కొనుగోలు ఒప్పందం చేసుకున్నప్పుడు కూడా కుంభకోణంగా చిత్రీకరించారని గుర్తుచేశారు. అప్పట్లో యూనిట్ విద్యుత్‌ను రూ.3.90కు కొనుగోలు చేస్తే కుంభకోణమని ఆరోపించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు యూనిట్‌కు రూ.15 చెల్లించి విద్యుత్ కొనుగోలు చేయాలని చూస్తోందని విమర్శించారు. గత విద్యుత్ కొనుగోళ్లపై కుంభకోణం పేరుతో కమిషన్ ఏర్పాటు చేసి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బదనాం చేసేందుకు కుట్ర చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో సుమారు 30 లక్షల విద్యుత్ పంపుసెట్లు ఉన్నాయని, రైతులకు నిరంతర విద్యుత్ అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. కుటీర పరిశ్రమలు, ఇతర పరిశ్రమలకు కూడా నిరంతర విద్యుత్ సరఫరా అవసరమని తెలిపారు. ఈ అవసరాలను దృష్టిలో పెట్టుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసి 24 గంటల విద్యుత్ అందించిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే కోతలు మొదలయ్యాయని విమర్శించారు.

సముద్రంలోకి వెయ్యి టీఎంసీలు

సాగునీరు, కరువు పరిస్థితులపై కాంగ్రెస్ ప్రభుత్వం సరైన సమయంలో స్పందించలేదని కేటీఆర్ ఆరోపించారు. సుమారు వెయ్యి టీఎంసీల నీటిని సముద్రంలోకి వదిలేసి ఇప్పుడు ఎల్–నినోను సాకుగా చూపుతూ చేతులెత్తేస్తున్నారని విమర్శించారు. ఆరు నెలల ముందే కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోసి వినియోగించుకోవాలని బీఆర్ఎస్ తరఫున ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు వద్దకు వెళ్లి వృథాగా దిగువకు ప్రవహిస్తున్న నీటిని ప్రజలకు, ప్రభుత్వానికి చూపించామని చెప్పారు. అయినప్పటికీ ప్రభుత్వం నీటిని ఎత్తిపోసేందుకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కొన్నేళ్లుగా తనపై, బీఆర్ఎస్‌పై చేసిన ఆరోపణలు తప్పని తేలిపోతాయనే ఉద్దేశంతోనే రేవంత్ రెడ్డి నీటిని ఎత్తిపోసేందుకు ముందుకు రాలేదని విమర్శించారు. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోసి వినియోగించుకోవాలని కోరినా ప్రభుత్వం స్పందించలేదన్నారు. అందుబాటులో ఉన్న నీరు వృథాగా దిగువకు వెళ్లిపోయిందని, పంటలు ఎండిపోతున్నాయని, తాగునీరు, సాగునీటి కొరత మొదలైందని ఆవేదన వ్యక్తం చేశారు. ముందస్తు చర్యలు తీసుకోకుండా ఇప్పుడు ఎల్–నినో వచ్చిందని చెప్పి ముఖ్యమంత్రి బాధ్యతల నుంచి తప్పించుకుంటున్నారని ఆరోపించారు. ఏపీలో సుమారు 700 కి.మీ దూరంలోని కుప్పం వరకు నీటిని తీసుకెళ్లారని, పట్టిసీమ పంపుల ద్వారా సుమారు 400 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తున్నారని తెలిపారు. పోతిరెడ్డిపాడు మొదలుకొని వివిధ ప్రాజెక్టుల్లో నీటిని నింపుకున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో కేవలం 70 కి.మీ దూరంలో ఉన్న మహబూబ్‌నగర్‌కు కూడా నీటిని తీసుకెళ్లలేకపోతున్నారని రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా రాష్ట్రం దేశానికి అన్నపూర్ణగా నిలిచే పరిస్థితి ఉండేదని, కానీ కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం కరువు దిశగా వెళ్తోందని అన్నారు.

క్రాప్ డే దురదృష్టకరం

తెలంగాణలో క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి రావడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. నర్సంపేట నియోజకవర్గంలో రాబోయే రెండేళ్లలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గాన్ని దత్తత తీసుకుని, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. సుదర్శన్ రెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా కలిసి పనిచేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడి ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

మోదీకి వ్యతిరేకంగా విద్రోహ శక్తుల కుట్రలు

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధ్వజం

ప్రజానావ, హైదరాబాద్: శ్రీలంకలో ప్రభుత్వాన్ని కూల్చిన మాదిరిగానే భారత్‌లోనూ ఎన్డీయే ప్రభుత్వాన్ని కూల్చేస్తామని రాహుల్ గాంధీ దింపుడు కళ్లం ఆశలు పెట్టుకున్నారని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీకి దమ్ముంటే ప్రజాదరణతో ఎన్నికైన మోదీ ప్రభుత్వాన్ని పడగొట్టి చూడావని సవాల్ విసిరారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ఎన్నికల నిర్వహణ యావత్ ప్రపంచానికే ఆదర్శమని, స్వతంత్ర వ్యవస్థ అయిన ఎన్నికల కమిషన్‌పై బురద చల్లేందుకు రాహుల్ నిరంతరం యత్నిస్తున్నారని దుయ్యబట్టారు. దేశ భద్రతను కాపాడుతూ ప్రజల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌ను రాజకీయాల్లోకి లాగడం అత్యంత దుర్మార్గమని కిషన్ రెడ్డి ఖండించారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇంత బాధ్యతారాహిత్యమైన, బలహీనమైన ప్రతిపక్ష నేతను దేశం ఎన్నడూ చూడలేదన్నారు. నాడు వాజ్‌పేయి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు కాంగ్రెస్‌తో విభేదాలు ఉన్నప్పటికీ దేశ ప్రయోజనాల కోసం పీవీ నరసింహారావు ప్రభుత్వ హయాంలో విదేశీ ప్రతినిధి బృందానికి నేతృత్వం వహించిన చారిత్రక సంప్రదాయాన్ని గుర్తుచేశారు. సర్ ప్రక్రియపై రాహుల్ గాంధీకి ప్రాథమిక జ్ఞానం కూడా లేదని, ఇది నెహ్రూ, ఇందిర, రాజీవ్, పీవీ కాలం నుంచే అమల్లో ఉన్న రాజ్యాంగ ప్రక్రియ అని స్పష్టం చేశారు. కేరళలో సీపీఎం లక్షలాది దొంగ ఓట్లను సర్ ద్వారా తొలగించడం వల్లే కాంగ్రెస్ గెలిచిందని ఆ పార్టీ నేతలే ఒప్పుకున్నారని గుర్తుచేశారు.

న్యాయస్థానాలపై ఒత్తిడి

న్యాయస్థానాల ముందుకు కాంగ్రెస్ నేతలు ఊరేగింపుగా వెళ్లడం అత్యంత గర్హనీయమని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ముఖ్యమంత్రులు, ఎంపీలను తరలించి సుప్రీంకోర్టుపై ఒత్తిడి తెచ్చేందుకు, న్యాయమూర్తులను బ్లాక్‌మెయిల్ చేసేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నుతోందని ఆరోపించారు. బారికేడ్లు ఎక్కి డ్యాన్సులు చేయడం, మహిళా పోలీసులపై దురుసుగా ప్రవర్తించడం పట్ల దేశ ప్రజలు ఛీత్కరించుకుంటున్నారన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ అరాచకాలు

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎండగడుతున్నామని కిషన్ రెడ్డి అన్నారు. ఇందిరా పార్క్ వద్ద ధర్నా చేయాలన్నా, ఫీజు రీయింబర్స్‌మెంట్, జీవో 22ఏ సమస్యలపై పోరాడాలన్నా బీజేపీ కార్యకర్తలను, రాష్ట్ర అధ్యక్షుడిని వారంలో ఐదుసార్లు అర్ధరాత్రి ఇళ్లల్లోకి చొరబడి అక్రమంగా నిర్బంధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీలో రైతులు ఏడాదిన్నరపాటు నిరసనలు చేపడితే కేంద్రం ప్రజాస్వామ్యబద్ధంగా వ్యవహరించిందని, కానీ ఇక్కడ మాత్రం ప్రతిపక్షాల గొంతు నొక్కుతున్నారని విమర్శించారు. దేశ అభివృద్ధిని, ప్రపంచవ్యాప్తంగా నరేంద్ర మోదీ నాయకత్వంలో పెరుగుతున్న దేశ ప్రతిష్ఠను జీర్ణించుకోలేక అంతర్జాతీయ పెట్టుబడిదారీ శక్తులు, డీప్ స్టేట్ మీడియా, విదేశీ శక్తులు, దేశీయ విద్రోహ శక్తులు ఏకమై కుట్రకు తెరలేపాయని.. ప్రపంచ శక్తులన్నీ ఏకమైనా మోదీ ప్రభుత్వాన్ని వెంట్రుక కూడా పీకలేవని స్పష్టం చేశారు.

కరువు నివారణలో సీఎం అట్టర్ ఫ్లాప్

- రేవంత్ అవగాహనా రాహిత్యంతోనే సమస్య
- రైతు కూలీలకు ఏడాదికి రూ.12వేలు ఇవ్వాలి
- పవర్ మ్యాక్స్ కంపెనీతో ఒప్పందం ఏంటో బయటపెట్టాలి
- టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత



ప్రజానావ, హైదరాబాద్: కరువు వస్తుందనే ముందే హెచ్చరించినా ముందస్తు చర్యలు చేపట్టడంలో సీఎం రేవంత్ రెడ్డి అట్టర్ ఫ్లాప్ అయ్యారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. బంజారాహిల్స్ లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ ఏడాది జనవరి నుంచే ఎల్ నినో ఎఫెక్ట్ తో తీవ్రమైన కరువు వచ్చే ప్రమాదముందని హెచ్చరించినా కనీస చర్యలు చేపట్టలేదన్నారు. దొంగలు పడిన ఆరు నెలలకు అన్నట్లుగా ఇప్పుడొచ్చి రైతులు త్యాగాలు చేయాలని చెప్పడం సిగ్గుచేటు అన్నారు. కరువు విషయంలో తాను ఏమీ చేయలేనని రేవంత్ రెడ్డి నిస్సహాయతను వ్యక్తం చేస్తూ చేతులెత్తేశారని మండిపడ్డారు. ఆగస్టులో 28 అలర్ట్ అయి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదన్నారు. పక్క రాష్ట్రాలు కరువు మండలాలను ప్రకటించి కేంద్రానికే ఇప్పటికే నివేదిక పంపాయని గుర్తుచేశారు. మన సీఎం మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇప్పుడు రివ్యూలు అంటూ కాలం వెళ్లదీసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతోందని, ఇప్పటివరకు పాలమూరు– రంగారెడ్డి పూర్తి చేయలేదని, మేడిగడ్డ బ్యారేజ్ ను కూడా రిపేర్ చేయలేదని అన్నారు. వాటిని పూర్తి చేసి ఉంటే ఇవ్వాళ రాష్ట్రానికి ఈ పరిస్థితి వచ్చేది కాదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1.86 లక్షల కోట్లు ఖర్చు చేసినా ప్రాజెక్టులు పూర్తి కాలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రూ.26 వేల కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా కొత్తగా నీళ్లు ఇవ్వలేదన్నారు.

మేడిగడ్డ రిపేర్లకు ఇదే సరైన సమయం

మేడిగడ్డ బ్యారేజ్ రిపేర్లు చేసుకోవడానికి ఇదే సరైన సమయమని, వచ్చే వర్షాకాలంలోగా ఆ పనులు పూర్తి చేసి గోదావరి నీళ్లను వినియోగంలోకి తేవాలని ఆమె డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి అనుభవలేమి రాష్ట్రానికి శాపంగా మారిందన్నారు. పంట నష్టపోయిన వారికి ఎకరానికి రూ.10 వేలు ఇస్తామని లీకులు ఇస్తున్నారే తప్ప ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేయడం లేదన్నారు. యాసంగిలో పంటలు సాగు చేయకపోతే రైతు కూలీలు ఆగమయ్యే పరిస్థితి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు సైతం పనులు లేక పట్టణాలకు వలస వెళ్లే పరిస్థితి ఉందని, పట్టణాల్లో సరైన ఉపాధి అవకాశాలు లేవని అన్నారు. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇవ్వడంతో పాటు వారి కుటుంబాలకు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీలో పని దినాలు పెంచడం కోసం ఇప్పుడు కమిటీ వేస్తే ఎప్పుడు కేంద్రానికి నివేదిక ఇస్తారు.. వాళ్లు ఎప్పుడు ఆమోదిస్తారని ప్రశ్నించారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌లో కొన్ని కాంపొనెంట్లను ప్రైవేటీకరించి దోచుకునేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. పవర్ మ్యాక్స్ కంపెనీతో ముఖ్యమంత్రికి ఉన్న సంబంధాన్ని బయటపెట్టాలని డిమాండ్ చేశారు. కరెంట్ విషయంలో ప్రభుత్వానికి అధికారం ఉండాలని గతంలో మాట్లాడిన సీఎం.. ఇప్పుడు ప్రైవేటీకరణకు ఎందుకు యత్నిస్తున్నారని ప్రశ్నించారు. రైతులకు నీళ్లు, కరెంట్ ఇవ్వగలిగే పరిస్థితి ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వడం లేదని, ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు. కరెంట్ కష్టాలను అధిగమించేందుకు అవసరమైతే కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను కలుస్తామని, ఢిల్లీకి వెళ్లి కేంద్రం పెద్దలతో మాట్లాడతామని చెప్పారు. హైదరాబాద్ లో నీటి కొరతకు కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 8వేల చెరువులు మాయం చేశారని చెప్పారు. దీంతో నగరంలో భూగర్భ జలాలు అడుగంటాయని తెలిపారు.

అఖిలపక్షంతో ప్రయోజనం లేదు

కరువు విషయంలో అఖిలపక్ష మీటింగ్ పెడతా మని అంటున్నారని కానీ దానితో ప్రయోజనం ఏముంటుందని ప్రశ్నించారు. ఈ పని ముందే చేయాల్సిందన్నారు. బీసీ బిల్లు విషయంలో అఖిలపక్షాన్ని ఢిల్లీకి ఎందుకు తీసుకెళ్లలేదని నిలదీశారు. ఇప్పుడు తాను చేసిన తప్పుకు అందరినీ భాగస్వాములు చేసే ప్రయత్నం చేస్తున్నారని కవిత మండిపడ్డారు. విదేశీ బొగ్గు కొనుగోలు ఒప్పందాలపై విచారణ పేరుతో ప్రతిమ శ్రీనివాస్ రావుకు వ్యతిరేకంగా కేటీఆర్ లేఖ రాయడంపై కవిత ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఉద్యమకాలంలో బీఆర్ఎస్‌కు పూర్తి అండగా ఉన్న ఆయనపై విచారణ కోరడం అంటే నమ్మినోళ్లను నట్టేట ముంచడమేనన్నారు. సాయం చేసిన వాళ్లను, కుల బంధువులను ఇబ్బంది పెట్టడం, ఇంటి మనిషినైనా తనను కిరాయి మనుషులతో తిట్టించే నైజం కేటీఆర్ ది అని మండిపడ్డారు. తమ పోరాటాలతోనే ప్రభుత్వం దిగి వచ్చి సింగరేణిలో మెడికల్ బోర్డు నిర్వహిస్తోందని గుర్తు చేశారు.



41 బార్లకు లక్కీ డ్రా పూర్తి

- మొత్తం 8,770 దరఖాస్తులు
- హైదరాబాద్‌లోని 14 బార్ల కోసం 4,251 మంది పోటీ
- జిల్లాల్లోని 27 బార్లకు 4,519 దరఖాస్తులు
- కలెక్టర్లు, ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణలో ఎంపిక
- ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ముగిసిన ప్రక్రియ

ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణలో బార్ల లైసెన్సుల కేటాయింపునకు నిర్వహించిన లక్కీ డ్రా ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆబ్కారీ శాఖ పరిధిలోని 41 బార్లకు సంబంధించి శుక్రవారం నిర్వహించిన డ్రాలో విజేతలను ఎంపిక చేశారు. వీటిలో హైదరాబాద్ పరిధిలోని 14 బార్లతో పాటు వివిధ జిల్లాల్లోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పరిధిలోని మరో 27 బార్లు ఉన్నాయి. మొత్తం 8,770 దరఖాస్తులు రావడంతో పోటీ తీవ్రంగా నెలకొంది. గ్రేటర్ హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి డిప్యూటీ కమిషనర్ల పరిధిలోని 14 బార్లకు నగరంలోని ది అడ్రస్ కన్వెన్షన్ అండ్ ఎగ్జిబిషన్ హాల్‌లో డ్రా నిర్వహించారు. ఉదయం నుంచే దరఖాస్తుదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ బార్ల కోసం 4,251 దరఖాస్తులు అందాయి. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ సమక్షంలో ప్రక్రియ కొనసాగింది. దరఖాస్తుదారులకు కేటాయించిన నంబర్లతో కూడిన నాణేలను బాక్స్‌లో వేసి డ్రా తీశారు. ఎంపికైన నంబర్లను మైకులో ప్రకటించడంతో పాటు పెద్ద తెరపై ప్రదర్శించారు. అనంతరం విజేతలకు అనుమతి పత్రాలు అందజేశారు.

జిల్లాల్లో 4,519 దరఖాస్తులు

వివిధ జిల్లాల్లోని 27 బార్లకు 4,519 దరఖాస్తులు వచ్చాయి. ఆయా జిల్లాల కలెక్టర్ల పర్యవేక్షణలో లక్కీ డ్రా నిర్వహించి విజేతలను ప్రకటించారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, నిజామాబాద్, కామారెడ్డి, ఫ్యూచర్ సిటీ, వికారాబాద్, వరంగల్ రూరల్, జనగామ, మహబూబాబాద్‌తో పాటు జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల పరిధిలో ఎంపిక ప్రక్రియ చేపట్టారు. భారీ సంఖ్యలో దరఖాస్తులు రావడంతో డ్రా నిర్వహణపై ఎక్సైజ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రక్రియ పూర్తికావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. డ్రా విజయవంతానికి సహకరించిన దరఖాస్తుదారులు, విధులు నిర్వహించిన ఎక్సైజ్ అధికారులు, సిబ్బందిని కమిషనర్ సి. హరికిరణ్ అభినందించారు.

నేడు బతుకమ్మ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ అవార్డుల పంపిణీ

- ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు

ప్రజానావ, హైదరాబాద్: హైదరాబాద్ శిల్పకళా వేదికలో శనివారం ఉదయం 11 గంటలకు బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ అవార్డుల వేడుకలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను దిల్ రాజు పరిశీలించారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్, ఎఫ్‌డీసీ ఎండీ డాక్టర్ జి.ముకుంద రెడ్డి, క్రియేటివ్ డైరెక్టర్ కొండ రాజు, టీజీఎఫ్‌డీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాబు, ఐఅండ్‌పీఆర్ అదనపు సంచాలకుడు డి.ఎస్.జగన్, యాంకర్ ఉదయ భాను తదితరులు పాల్గొన్నారు. ఈ ఛాలెంజ్‌కు ఎంపికైన 35మంది యంగ్ ఫిల్మ్ మేకర్స్‌కు అవార్డులు అందజేస్తారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు, రోడ్లు , భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిలు, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఇతర ప్రజా ప్రతినిధులు, సినిమా రంగ ప్రముఖులు, తదితరులు పాల్గొంటారు. బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో 2వ యంగ్ ఇండి యా ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్ ఛాలెంజ్–2026లో భాగంగా 5 కేటగిరీల పోటీలలో పాల్గొనేందుకు 2,670 మంది ఔత్సాహికులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఎంట్రీల పరిశీలన, అవార్డులకు ఎంపికకు ప్రతి కేటగిరీకి ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేశారు.



కామన్వెల్త్ క్రీడలకు రూ.2,500 కోట్లు

- వేడుకల నిర్వహణకు కేంద్రం ఆర్థిక భరోసా
- ప్రస్తుత ధరల ప్రకారం రూ.2వేల కోట్ల గ్రాంట్
- అవసరాన్ని బట్టి గుజరాత్‌కు నిధుల విడుదల
- 15–17 క్రీడాంశాలతో నిర్వహణకు ప్రణాళిక

న్యూఢిల్లీ: 2030లో అహ్మదాబాద్‌లో నిర్వహించనున్న కామన్వెల్త్ క్రీడల కోసం గుజరాత్ ప్రభుత్వానికి రూ.2,000 కోట్ల గ్రాంట్ అందించేందుకు కేంద్ర క్రీడల మంత్రిత్వశాఖ అంగీకరించింది. జాతీయ క్రీడా సమాఖ్యలకు సహాయ పథకం (ఏఎన్ఎస్ఎఫ్) సవరించిన మార్గదర్శకాల్లో ఈ నిధులను చేర్చింది. 2025 ధరల ప్రకారం నిర్ణయించిన ఈ మొత్తం, వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా 2030 నాటికి సుమారు రూ.2,500 కోట్లకు చేరవచ్చని అంచనా వేసింది. గుజరాత్ ప్రభుత్వం అభ్యర్థించినప్పుడు అవసరాన్ని బట్టి నిధులు విడుదల చేయనున్నారు. 2026–27 నుంచి 2030–31 వరకు ఈ పథకం అమలుకు కేంద్రం రూ.7,386.74 కోట్ల కేటాయింపునకు ఆమోదం తెలిపింది. కామన్వెల్త్ క్రీడల శతాబ్ది ఎడిషన్‌కు అహ్మదాబాద్ ఆతిథ్యమివ్వనుంది. గతేడాది నైజీరియాతో పోటీపడి భారత్ ఈ అవకాశాన్ని దక్కించుకుంది.



సద్దుల బతుకమ్మ వేడుకలకు గవర్నర్‌కు ఆహ్వానం

- ట్యాంక్‌బండ్‌పై ఈ నెల 18న వేడుకలు
- ఆహ్వాన పత్రిక అందజేసిన మంత్రి జూపల్లి

ప్రజానావ, హైదరాబాద్: ట్యాంక్‌బండ్‌పై ఈ నెల 18న నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ వేడుకలకు హాజరుకావాల్సిందిగా రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆహ్వానించారు. శుక్రవారం సాయంత్రం లోక్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన మంత్రి.. వేడుకల ఆహ్వాన పత్రికను అందజేశారు.

గవర్నర్‌తో రిటైర్డ్ డీజీపీ భేటీ

ప్రజానావ, హైదరాబాద్: రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, మాజీ డీజీపీ, బెంగళూరు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ సభ్యుడు సంతోష్ మెహ్రా శుక్రవారం ఉదయం లోక్‌భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు.

బతుకమ్మ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు

- సికింద్రాబాద్ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రత్యేక చర్యలు
- కట్ట మైసమ్మ ఆలయంలో అన్నప్రసాద పంపిణీలో ఎమ్మెల్యే పద్మారావు గౌడ్



ప్రజానావ, సికింద్రాబాద్: బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని సికింద్రాబాద్ పరిధిలోని అన్ని వార్డుల్లో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ తెలిపారు. చిలకలగూడ కట్ట మైసమ్మ దేవాలయంలో తార్నాక మాజీ కార్పొరేటర్ అలకుంట సరస్వతి హరి కుటుంబ సభ్యులు శుక్రవారం నిర్వహించిన అన్నప్రసాద పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. స్థానిక భక్తుల సౌకర్యార్థం తమ చొరవతో నవరాత్రి ఉత్సవాల్లో కట్ట మైసమ్మ దేవాలయం వద్ద అన్నప్రసాద పంపిణీ జరిగేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పండుగ వేడుకలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు సామాల హేమ, కంది శైలజ, అలకుంట సరస్వతి, చైర్మన్ గుంటి కృష్ణ, కార్యనిర్వహణాధికారి మహేందర్ గౌడ్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పినరయి విజయన్‌కు ఈడీ సమన్లు

- సీఎంఆర్ఎల్ లంచం కేసులో ఈ నెల 23న హాజరుకావాలని ఆదేశం
- హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించిన కేరళ మాజీ సీఎం



ప్రజానావ, తిరువనంతపురం : కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. సీఎంఆర్ఎల్ లంచం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై విచారణలో భాగంగా ఈ నెల 23న తమ ఎదుట హాజరుకావాలని శుక్రవారం ఆదేశించింది. ఇదిలా ఉండగా, ఈ కేసులో తనపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ కేరళ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ విజయన్ శుక్రవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై దసరా సెలవుల అనంతరం అక్టోబర్ 26న విచారణ చేపడతామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) పేర్కొన్నారు.

జనగణన విధుల్లో ప్రైవేట్ పాఠశాలల సిబ్బంది

- ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, క్లరికల్ సిబ్బందికి అవకాశం
- కేంద్రం నిబంధనల సవరణ

న్యూఢిల్లీ : జనగణన విధులకు నియమించే సిబ్బంది పరిధిని కేంద్ర ప్రభుత్వం విస్తరించింది. సవరించిన నిబంధనల ప్రకారం ప్రైవేట్ విద్యాసంస్థల ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, క్లరికల్ సిబ్బందిని కూడా జనగణన విధులకు నియమించనున్నారు. ఈ మేరకు 1948 నాటి జనగణన చట్టంలోని సెక్షన్ 18(1) కింద కేంద్రం శుక్రవారం సవరించిన నిబంధనను జారీ చేసింది. వీటి ప్రకారం ప్రభుత్వ విద్యాసంస్థలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ ఆర్థిక సహాయం పొందే పాఠశాలలు, ప్రైవేట్ ఎయిడెడ్, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులతో పాటు సొసైటీలు, ట్రస్టుల్లో పనిచేసే సిబ్బందిని కూడా గణనాధికారులుగా (ఎన్యుమరేటర్లు) నియమించవచ్చు.





దుర్గామాత పూజ ధర్మ విజయానికి ప్రతీక

- బెంగాలీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో బాంగియా సంఘం కృషి అభినందనీయం
- సికింద్రాబాద్‌లో దుర్గాపూజ ఉత్సవాల్లో గవర్నర్ శివప్రతాప్ శుక్లా

ప్రజానావ, హైదరాబాద్: దుర్గామాత పూజ భక్తి, శక్తి ఆరాధనతోపాటు ధర్మం, న్యాయం, సత్యం పట్ల నిబద్ధతను చాటిచెప్పే పర్వదినమని రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. అమ్మవారి శక్తి స్వరూపం ప్రతి ఒక్కరిలో ధైర్యాన్ని నింపి, సత్యం, న్యాయం వైపు నడిపిస్తుందని పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం సికింద్రాబాద్‌లోని కీస్ బాలికల ఉన్నత పాఠశాలలో హైదరాబాద్ బాంగియా సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గాపూజ ఉత్సవాలు–2026కు గవర్నర్ తన సతీమణి జానకి శుక్లాతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత 61 ఏళ్లుగా నిరంతరాయంగా దుర్గోత్సవాలను నిర్వహిస్తున్న బాంగియా సాంస్కృతిక సంఘం కృషి అభినందనీయమని గవర్నర్ అన్నారు. ఆరు దశాబ్దాలకు పైగా కొనసాగుతున్న ఈ వేడుకలు భారతీయ సంస్కృతి, ఆధ్యాత్మిక విశ్వాసాలకు నిదర్శనమని పేర్కొన్నారు. దుర్గామాత దివ్యరూపం ధైర్యం, కరుణ, సత్యనిష్ఠ, న్యాయబద్ధత వంటి విలువలను బోధిస్తుందని తెలిపారు. సమస్త ప్రాణుల్లో శక్తి స్వరూపిణిగా అమ్మవారు కొలువై ఉన్నారనే సనాతన ధర్మ సందేశం ప్రతి ఒక్కరిలోని గౌరవాన్ని, దైవత్వాన్ని గుర్తించాలని సూచిస్తుందన్నారు. బెంగాలీ సంస్కృతి, సాహిత్యం, సంప్రదాయాలను పరిరక్షించడంలో బాంగియా సాంస్కృతిక సంఘం చేస్తున్న కృషిని గవర్నర్ ప్రశంసించారు. తెలంగాణ సమృద్ధమైన తెలుగు సంస్కృతితో సమన్వయం సాధిస్తూ ఇటువంటి వేడుకలను నిర్వహించడం విశేషమన్నారు. దేశంలోని భిన్న సంస్కృతులు, సంప్రదాయాలు భారతదేశ ఐక్యతకు బలమని, ఇలాంటి ఉత్సవాలు 'ఏక్ భారత్–శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖశాంతులు, సమృద్ధి, ఆరోగ్యం కలగాలని, దేశం అభివృద్ధి, ప్రపంచ శ్రేయస్సు దిశగా నిరంతరం ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఉత్సవాల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బాంగియా సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు దీపక్ భట్టాచార్జీ, ఉపాధ్యక్షుడు అభిజిత్ భట్టాచార్జీ, ప్రధాన కార్యదర్శి సుబ్రతా గంగూలీ, సంఘం సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



వట్టినాగులపల్లి బతుకమ్మ వేడుకలకు ప్రముఖులకు ఆహ్వానం

ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌కు ఆహ్వాన పత్రికల అందజేత

ప్రజానావ, వట్టినాగులపల్లి: గ్రామంలో ఆదివారం నిర్వహించనున్న బతుకమ్మ పండుగ వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరుకావాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌లను నిర్వాహకులు ఆహ్వానించారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు మైలారం ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో నాయకుల బృందం శుక్రవారం వారిని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికలు అందజేసింది. మాజీ వార్డు సభ్యులు కుమ్మరి శేఖర్, గుడాల అరుణ్‌కుమార్ ముదిరాజ్, కొండే సాయికిరణ్ యాదవ్ తదితరులు ఇరువురు ప్రముఖుల నివాసాలకు వెళ్లి వేడుకలకు హాజరుకావాలని కోరారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను గ్రామంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మైలారం ప్రదీప్ కుమార్, కుమ్మరి శేఖర్, గుడాల అరుణ్‌కుమార్ ముదిరాజ్, కొండే సాయికిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తార్నాకలో బతుకమ్మ ఏర్పాట్ల పరిశీలన

- మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి
- జీహెచ్ఎంసీ అధికారులకు మాజీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత సూచన



ప్రజానావ, హైదరాబాద్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను మహిళలు, ప్రజలు ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు నగర మాజీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి సూచించారు. దసరా, బతుకమ్మ పండుగల నేపథ్యంలో తార్నాక డివిజన్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీల్లో అధికారులతో కలిసి పర్యటించి, బతుకమ్మ ఆడేందుకు ఏర్పాటు చేసిన ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పారిశుధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, వీధి దీపాల ఏర్పాటు తదితర అంశాలను సమీక్షించారు. బతుకమ్మ వేడుకలకు వచ్చే మహిళలు, చిన్నారులు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పండుగ జరిగే ప్రదేశాల్లో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైన చోట వీధి దీపాలు ఏర్పాటు చేసి రాత్రి వేళల్లోనూ తగిన వెలుతురు ఉండేలా చూడాలన్నారు. బతుకమ్మ ఆడే ప్రాంతాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని మోతే శ్రీలత పేర్కొన్నారు. మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా వేడుకల్లో పాల్గొనేలా సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని అన్నారు. పారిశుధ్యం, వీధి దీపాలు, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు. తార్నాక డివిజన్‌లోని బస్తీలు, కాలనీల్లో పండుగ ఏర్పాట్లను పరిశీలిస్తూ, ప్రజలకు అవసరమైన సదుపాయాల కల్పనపై అధికారులతో చర్చించారు.



ఫిబ్రవరి నుంచే భానుడి భగభగలు!

- ఎల్‌నినోతో రబీ, వేసవి పంటలకు ముప్పు
- నీటి సంక్షోభం తీవ్రం కావచ్చని హెచ్చరిక
- దేశంలోని 44 శాతం జిల్లాల్లో లోటు వర్షపాతం
- తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో సాగు విస్తీర్ణం తగ్గుదల

న్యూఢిల్లీ : ఎల్‌నినో ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరిగి వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికే వేసవి పరిస్థితులు ఏర్పడే ప్రమాదముందని క్లైమేట్ ట్రెండ్స్ సంస్థ హెచ్చరించింది. భారత్‌పై ఎల్‌నినో ముప్పు తీవ్రంగా ఉందని, ఇప్పటికే నమోదైన వర్షపాతం లోటుకు తోడు వెచ్చని శీతాకాలం రబీ పంటలపై మరింత ఒత్తిడి పెంచుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. నేలలో తేమ తగ్గడం, భూగర్భ జలాలు క్షీణించడం, రిజర్వాయర్లలో నీటి నిల్వలు తగ్గడం వల్ల రబీతో పాటు వేసవి పంటలకూ ముప్పు పొంచి ఉందని తెలిపింది. వాతావరణ మార్పులు, భూతాపం ఎల్‌నినో ప్రభావాన్ని మరింత తీవ్రతరం చేసే అవకాశం ఉందని పేర్కొంది. వరి, చెరకు, పత్తి పంటల సాగు విస్తీర్ణంలో ఇప్పటికే తగ్గుదల కనిపిస్తోందని వివరించింది. 'భారత్‌పై ఎల్‌నినో ముప్పేట ముప్పు' పేరుతో శుక్రవారం విడుదల చేసిన అధ్యయన నివేదికలో ఈ అంశాలను వెల్లడించింది. 2026 చివరి నాటికి ఎల్‌నినో గరిష్ఠ స్థాయికి చేరుకుని, దాని ప్రభావం 2027లోనూ కొనసాగే అవకాశం ఉందని నివేదిక అంచనా వేసింది. నివేదిక ప్రకారం, నైరుతి రుతుపవనాలు గత దశాబ్దంలో ఎన్నడూ లేనంత బలహీనంగా మారడంతో దేశవ్యాప్తంగా సాధారణం కంటే 13 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. దేశంలోని 44 శాతం జిల్లాల్లో తీవ్ర వర్షపాత లోటు నెలకొంది. వర్షాభావానికి తోడు అధిక ఉష్ణోగ్రతలు వడగాడ్పుల తీవ్రతను పెంచుతున్నాయని, ఇవి ప్రజల ఆరోగ్యంపై, పర్యావరణంపై ప్రభావం చూపుతున్నా యని తెలిపింది. తెలంగాణ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, మహారాష్ట్రల్లో కరవు పరిస్థితులు నెలకొన్నట్లు నివేదిక పేర్కొంది. వరి, గోధుమ, పత్తి, చెరకు ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం పడటంతో పాటు జలవిద్యుత్ ఉత్పత్తికీ ఆటంకాలు ఏర్పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. 2026–27 వ్యవసాయ సంవత్సరానికి కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆహార ధాన్యాల ఉత్పత్తి లక్ష్యాన్ని 373.93 మిలియన్ టన్నులుగా నిర్ణయించినట్లు నివేదికలో ప్రస్తావించింది.

దక్షిణ, ఈశాన్య ప్రాంతాలపై ప్రభావం

దేశంలోని ప్రధాన వర్షపాత ప్రాంతాలైన దక్షిణ ద్వీపకల్పం, తూర్పు–ఈశాన్య రాష్ట్రాల్లో వర్షపాతం లోటు ఎక్కువగా ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. తూర్పు–ఈశాన్య ప్రాంతాల్లో 1901 తర్వాత అత్యల్ప వర్షపాతం నమోదైందని పేర్కొంది. దక్షిణ ద్వీపకల్పంలో సాధారణ వర్షపాతం 716 మిల్లీమీటర్లు కాగా, 542 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైనట్లు తెలిపింది. ఇది 1901 తర్వాత నాలుగో అత్యల్ప వర్షపాతమని వివరించింది. కర్ణాటకలో 30 శాతం, కేరళలో 28 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 25 శాతం, తమిళనాడులో 20 శాతం, తెలంగాణలో 18 శాతం వర్షపాతం లోటు నమోదైనట్లు నివేదిక పేర్కొంది. రాయలసీమలో 40 శాతం, కర్ణాటకలోని రామనగర జిల్లాలో 91 శాతం లోటు ఉన్నట్లు వివరించింది. ఎల్‌నినో పరిస్థితుల్లోనూ అల్పపీడన వ్యవస్థలు ఏర్పడినప్పటికీ, వాటి వల్ల దేశంలోని అన్ని ప్రాంతాల్లో సమానంగా వర్షాలు కురవలేదని నివేదిక విశ్లేషించింది. రుతుపవనాల కదలికల్లో మార్పులు, వర్షాల మధ్య ఎక్కువ విరామాలు, తక్కువ సమయంలో భారీ వర్షాలు కురవడం వంటి పరిణామాలు వ్యవసాయంపై ప్రభావం చూపుతున్నాయని పేర్కొంది.

మూడు ప్రధాన పంటల సాగు తగ్గుదల

ఎల్‌నినో ప్రభావం వరి, చెరకు, పత్తి పంటలపై అధికంగా పడుతున్నట్లు నివేదిక తెలిపింది. అక్టోబరు 5 వరకు అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం, గత వ్యవసాయ సంవత్సరంతో పోలిస్తే ఖరీఫ్‌లో ఈ పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. మరోవైపు వర్షాభావాన్ని తట్టుకునే పప్పుధాన్యాలు, నూనెగింజల సాగు పెరిగినట్లు పేర్కొంది. రైతులు వర్షాలపై తక్కువగా ఆధారపడే పంటలవైపు మొగ్గు చూపుతున్నారని ఇది సూచిస్తోంది. వరి సాగు విస్తీర్ణం తెలంగాణలో 4.26 లక్షల హెక్టార్లు, కర్ణాటకలో 4.23 లక్షల హెక్టార్లు, ఉత్తరప్రదేశ్‌లో 1.84 లక్షల హెక్టార్లు, మధ్యప్రదేశ్‌లో 1.75 లక్షల హెక్టార్లు, ఆంధ్రప్రదేశ్‌లో 1.70 లక్షల హెక్టార్లు, తమిళనాడులో 1.41 లక్షల హెక్టార్లు, మహారాష్ట్రలో 1.15 లక్షల హెక్టార్లు, ఝార్ఖండ్‌లో లక్ష హెక్టారు మేర తగ్గినట్లు నివేదిక పేర్కొంది. వర్షపాతం తక్కువగా ఉండటమే కాకుండా, అది ప్రాంతాలవారీగా అసమానంగా కురవడం, రుతుపవనాల రాకలో ఆలస్యం, వర్షాల మధ్య పొడిగాపులు వ్యవసాయానికి ప్రధాన సవాళ్లుగా మారాయని విశ్లేషించింది. వీటి కారణంగా నేలలో తేమ తగ్గడంతో పాటు భూగర్భ జలాల పునరుద్ధరణపై ప్రతికూల ప్రభావం పడుతోందని తెలిపింది.

శరన్నవరాత్రి మండపాల్లో విజయరెడ్డి ప్రత్యేక పూజలు

ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు కలగాలని ఆకాంక్ష

ప్రజానావ, హైదరాబాద్: ఖైరతాబాద్ నియోజకవర్గం హిమాయత్‌నగర్ డివిజన్ పరిధిలో శ్రీశ్రీశ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల్లో ఖైరతాబాద్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి పి. విజయరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక బస్తీవాసులు, నాయకులు పాల్గొన్నారు.

పండగ రద్దీ.. ఆర్టీసీకి కాసుల పంట!

- సిటీ బస్సులనూ సుదూర ప్రాంతాలకు మళ్లింపు
- ప్రత్యేక సర్వీసుల్లో 50 శాతం అదనపు ఛార్జీలు
- మంచిర్యాల మార్గంలో 31 బస్సులు.. 26 స్పెషల్ సర్వీసులే

ప్రజానావ, హైదరాబాద్ : బతుకమ్మ, దసరా పండగల రద్దీని ఆర్టీసీ ప్రత్యేక ఆదాయ అవకాశంగా మలుచుకుంటోంది. హైదరాబాద్ నగరంలో స్వల్ప దూరాలకు తిరిగే సిటీ బస్సులను సైతం సుదూర ప్రాంతాలకు మళ్లించి ప్రత్యేక సర్వీసులుగా నడుపుతోంది. సాధారణ సర్వీసులను ప్రత్యేక బస్సులుగా మార్చి సాధారణ ఛార్జీల కంటే 50 శాతం అదనంగా వసూలు చేస్తుండటంతో ప్రయాణికులపై భారం పడుతోంది. మరోవైపు పండగ రద్దీతో సాధారణ బస్సులతో పాటు ప్రత్యేక సర్వీసులకూ భారీ డిమాండ్ నెలకొంది. హైదరాబాద్ నుంచి వరంగల్, సూర్యాపేట, మిర్యాలగూడ, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, సత్తుపల్లి, మహబూబ్‌నగర్, నారాయణఖేడ్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు ప్రయాణికులు పెద్ద సంఖ్యలో తరలివెళ్తున్నారు. ఆదివారం సద్దుల బతుకమ్మ ఉండటంతో శుక్రవారం నుంచే హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాలు, పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు ప్రయాణాలు పెరిగాయి. శనివారం రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది.

సిటీ బస్సులతో సుదూర ప్రయాణాలు

హైదరాబాద్‌లో తక్కువ దూరాలకు ప్రయాణించే మెట్రో డీలక్స్ బస్సులను కూడా పండగ ప్రత్యేక సర్వీసులుగా వినియోగిస్తున్నారు. వీటిని 50 శాతం అదనపు ఛార్జీలతో జూబ్లీ బస్ స్టేషన్ (జేబీఎస్) నుంచి మంచిర్యాల, గోదావరిఖని వంటి ప్రాంతాలకు నడుపుతున్నారు. జేబీఎస్ నుంచి మంచిర్యాలకు 91266 నంబరు బస్సును ప్రత్యేక సర్వీసుగా నడిపారు. హైదరాబాద్ నుంచి గోదావరిఖనికి 91287, 91255 నంబర్లతో మెట్రో డీలక్స్ బస్సులను కేటాయించారు.

మంచిర్యాల మార్గంలో ప్రత్యేక బస్సులే అధికం

జేబీఎస్ నుంచి మంచిర్యాలకు శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు 31 బస్సులు వెళ్లగా, వాటిలో 26 ప్రత్యేక సర్వీసులే ఉన్నాయి. అక్టోబరు 17న మొత్తం 56 సర్వీసులు నడపగా, వాటిలో 37 ప్రత్యేక బస్సులు ఉన్నట్లు సమాచారం. దీంతో ఈ మార్గంలో సగానికిపైగా సర్వీసుల్లో ప్రయాణికులు అదనపు ఛార్జీలు చెల్లించి సొంతూళ్లకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కరీంనగర్‌కు భారీ డిమాండ్

హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు వెళ్లే బస్సులకు భారీ డిమాండ్ నెలకొంది. సాధారణ సర్వీసులతో పాటు ప్రత్యేక బస్సుల్లోనూ 80 శాతానికి పైగా రిజర్వేషన్ టికెట్లు ఇప్పటికే అమ్ముడైనట్లు సమాచారం. పండగ రద్దీతో సీట్లకు గిరాకీ పెరగడంతో ప్రయాణికులు ముందుగానే టికెట్లు బుక్ చేసుకుంటున్నారు.



నాగర్‌కర్నూల్‌లో రూ.9.68 కోట్ల ధాన్యం మాయం

- పార్‌బాయిల్డ్ రైస్ మిల్లులో విజిలెన్స్ తనిఖీలు
- బహిరంగ మార్కెట్‌లో విక్రయించినట్లు అనుమానం


ప్రజానావ, నాగర్‌కర్నూల్ : జిల్లాలో ప్రభుత్వ ధాన్యం పక్కదారి పట్టిన వ్యవహారం కలకలం రేపుతోంది. నాగర్‌కర్నూల్ పట్టణ శివారులోని ఓ పార్‌బాయిల్డ్ రైస్ మిల్లులో సివిల్ సప్లైస్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి చెందిన కస్టమ్ మిల్లింగ్ ధాన్యంలో భారీగా కొరత ఉన్నట్లు గుర్తించారు. రికార్డుల ప్రకారం మిల్లులో ఉండాల్సిన ధాన్యం నిల్వలకు, క్షేత్రస్థాయిలో ఉన్న నిల్వలకు మధ్య భారీ వ్యత్యాసం కనిపించింది. కొరతగా గుర్తించిన ధాన్యం విలువ సుమారు రూ.9.68 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ప్రభుత్వ ధాన్యాన్ని బహిరంగ మార్కెట్‌లో విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో అనుమానాలు వ్యక్తమయ్యాయి.

13 మందిపై కేసు నమోదు

ఈ వ్యవహారంలో మిల్లు యజమానులు, నిర్వాహకులు, ఇతర సంబంధిత వ్యక్తులు కలిపి మొత్తం 13 మందిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. సివిల్ సప్లైస్ అధికారుల ఫిర్యాదు మేరకు నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్‌లో నిత్యావసర వస్తువుల చట్టం కింద కేసు నమోదైంది. నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. వానాకాలం సీజన్‌లో రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కోసం జిల్లాలోని పలు రైస్ మిల్లులకు కేటాయించారు. నిబంధనల ప్రకారం మిల్లర్లు ఆ ధాన్యాన్ని బియ్యంగా మార్చి, నిర్ణీత పరిమాణంలో ప్రభుత్వానికి తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. అయితే, నాగర్‌కర్నూల్ పట్టణ శివారులోని మిల్లులో ప్రభుత్వ ధాన్యం నిల్వల్లో భారీగా కొరత బయటపడటంతో అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. జిల్లాలోని ఇతర రైస్ మిల్లుల్లోనూ తనిఖీలు కొనసాగిస్తామని, ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదారి పట్టించే అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు హెచ్చరించారు. ఒకే మిల్లులో రూ.9.68 కోట్ల విలువైన ధాన్యం కొరత వెలుగుచూడటంతో జిల్లావ్యాప్తంగా ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

జహీరాబాద్ పూల మార్కెట్‌లో ధరల జోరు

- బతుకమ్మ, దసరా, దీపావళితో పెరిగిన గిరాకీ
- ఆరు నెలల కష్టం తర్వాత రైతులకు కాసుల పంట



ప్రజానావ, జహీరాబాద్: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పూల మార్కెట్ పండుగల సందడితో కళకళలాడుతోంది. బతుకమ్మ, దసరా, దీపావళి పండుగలు వరుసగా రావడంతో పూలకు భారీగా డిమాండ్ పెరిగింది. దీంతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఆరు నెలల పాటు కష్టపడి పూలను సాగు చేసిన రైతులకు ప్రస్తుతం మంచి ఆదాయం లభిస్తోంది. సాధారణ రోజులతో పోలిస్తే పూల ధరలు గణనీయంగా పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

బంతి పూలకే భారీ గిరాకీ

బతుకమ్మ పండుగలో బంతి, గునుగు, తంగేడు పూలకు ప్రత్యేక స్థానం ఉంది. ముఖ్యంగా పసుపు, ఎరుపు రంగుల బంతి పూలు లేకుండా బతుకమ్మను ఊహించలేరు. దీంతో మహిళలు బంతి పూల కొనుగోలుకు మార్కెట్‌కు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. సాధారణ రోజుల్లో కిలో రూ.20 నుంచి రూ.30 వరకు పలికే బంతి పూల ధర ప్రస్తుతం రూ.50 నుంచి రూ.80కు చేరింది. మార్కెట్‌కు ఉదయం వచ్చిన పూలు మధ్యాహ్నానికే అమ్ముడవుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

చామంతి, గులాబీలకూ డిమాండ్

దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో చామంతి, గులాబీ పూలకు కూడా గిరాకీ పెరిగింది. దేవాలయాల అలంకరణ, ఇళ్లలో పూజలు, పూలమాలల తయారీకి చామంతి పూలను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రస్తుతం చామంతి పూలు కిలో రూ.120 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. తెల్ల చామంతికి అధిక డిమాండ్ ఉండటంతో కిలో ధర రూ.160 వరకు పలుకుతోంది. గులాబీ పూల ధర కిలో రూ.200కు చేరగా, ఎర్ర గులాబీలకు మరింత ధర లభిస్తోంది. పండుగల అవసరాలతో పూల కొనుగోళ్లు పెరగడం ధరల పెరుగుదలకు కారణమవుతోంది.

తెల్లవారుజాము నుంచే సందడి

జహీరాబాద్ పూల మార్కెట్‌లో తెల్లవారుజామున నాలుగు గంటల నుంచే వ్యాపారాలు ప్రారంభమవుతున్నాయి. న్యాల్కల్, కోహిర్, ఝరాసంగం మండలాల నుంచి రైతులు పూల బుట్టలతో మార్కెట్‌కు చేరుకుంటున్నారు. మహిళలు బతుకమ్మల కోసం, వ్యాపారులు దుకాణాల అలంకరణ కోసం పూలను కొనుగోలు చేస్తున్నారు. రానున్న పది రోజుల పాటు పూలకు ఇదే స్థాయిలో డిమాండ్ ఉంటుందని వ్యాపారులు అంచనా వేస్తున్నారు. బతుకమ్మ పండుగ ముగిసినప్పటికీ దీపావళి వరకు చామంతి, గులాబీ పూలకు గిరాకీ కొనసాగుతుందని చెబుతున్నారు.

గ్యాస్ సిలిండర్‌పై అదనపు వసూళ్లు!

- బిల్లు రూ.964.50.. వసూలు మాత్రం రూ.వెయ్యి
- ప్రశ్నిస్తే బెదిరింపుల ధోరణి
- ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామంటున్న అధికారులు



ప్రజానావ, మధిర : మధిరలోని గ్యాస్ ఏజెన్సీ వ్యవహారశైలి వినియోగదారులకు ఇబ్బందులు కలిగిస్తోంది. గ్యాస్ సిలిండర్ ధరకు మించి అదనపు నగదు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదేమిటని ప్రశ్నిస్తే సమాధానం చెప్పాల్సింది పోయి బెదిరింపు ధోరణితో వ్యవహరిస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధిర గ్యాస్ ఏజెన్సీ పరిధిలో మూడు మండలాలకు చెందిన సుమారు 30 వేల మంది వినియోగదారులు ఉండగా, ప్రతి నెలా దాదాపు 20 వేల మందికి సిలిండర్లు పంపిణీ చేస్తున్నారు. అయితే ఒక్కో సిలిండర్‌పై సుమారు రూ.35 వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో నెలకు సుమారు రూ.4 లక్షల మేర వినియోగదారులపై అదనపు భారం పడుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బిల్లు ఒకటి.. వసూలు మరొకటి

గ్యాస్ సిలిండర్ల రవాణా కోసం సంబంధిత కంపెనీలు ఏజెన్సీలకు ఒక్కో సిలిండర్‌పై రూ.42 చొప్పున చెల్లిస్తాయని సమాచారం. 10 కిలోమీటర్ల పరిధిలోని వినియోగదారులకు సిలిండర్‌ను రూ.964.50కే అదనపు రుసుము లేకుండా అందించాల్సి ఉంది. అయినప్పటికీ మధిరలోని ఆకృతి పక్క వీధికి చెందిన చావా తిరుపతమ్మ నుంచి రూ.వెయ్యి వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. అదే వీధిలోని పలువురు వినియోగదారుల నుంచి ఒక్కో సిలిండర్‌కు రూ.980, రూ.990, రూ.వెయ్యి చొప్పున వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. నిర్ణీత ధరకు మించి నగదు ఎందుకు తీసుకుంటున్నారంటూ వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు. మధిరకు చెందిన తాళ్లూరి మేనకాదేవి 15 రోజుల క్రితం గ్యాస్ సిలిండర్ తీసుకున్నారు. సిలిండర్ పంపిణీ చేసిన సిబ్బంది ఆమె నుంచి రూ.వెయ్యి డిమాండ్ చేసినట్లు తెలిసింది. దీనిపై బిల్లు ఇవ్వాలని ఆమె అడగగా, రూ.980కు బిల్లు ఇస్తానని చెప్పిన సిబ్బంది నగదు తీసుకున్న అనంతరం రూ.964.50 బిల్లును చేతిలో పెట్టి వెళ్లిపోయినట్లు ఆరోపణలున్నాయి. బిల్లులో పేర్కొన్న ధరకు, వసూలు చేసిన నగదుకు మధ్య వ్యత్యాసంపై వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు

గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో బిల్లులో పేర్కొన్న మొత్తాన్నే చెల్లించాలని సివిల్ సప్లయ్స్ డీటీ ప్రసన్న సూచించారు. 10 కిలోమీటర్ల పరిధిలో అదనపు రుసుము వసూలు చేయకూడదని స్పష్టం చేశారు. ఎవరైనా అదనపు నగదు వసూలు చేస్తే తగిన ఆధారాలతో ఫిర్యాదు చేయాలని, వీలైతే ఆ సమయంలో జరిగిన సంభాషణను రికార్డు చేసి అందజేస్తే బాధ్యులపై తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమాచారం అందగానే తిరిగొచ్చిన డెలివరీ బాయ్

మధిరలోని చెరుకుమల్లి వారి వీధికి చెందిన జమ్ముల వెంకటేశ్వరరావు ఇంట్లో లేని సమయంలో గ్యాస్ సిలిండర్ పంపిణీ చేసేందుకు ఆటో వచ్చింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న ఆయన భార్యకు సిలిండర్ అందించిన డెలివరీ సిబ్బంది రూ.వెయ్యి వసూలు చేసి వెళ్లిపోయినట్లు ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంపై వివరాలు సేకరించి ఫోటో తీసిన కొన్ని గంటల్లోనే విషయం తెలుసుకున్న సంబంధిత డెలివరీ బాయ్ తిరిగి వచ్చి రూ.20 ఇచ్చి వెళ్లడం గమనార్హం. ఈ ఘటన గ్యాస్ సిలిండర్ల పంపిణీలో అదనపు వసూళ్లపై వస్తున్న ఆరోపణలకు మరింత ప్రాధాన్యం కల్పిస్తోంది. వినియోగదారుల నుంచి అదనపు నగదు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులపై అధికారులు స్పందించి, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయంలోనే టేకు చెట్లకు రక్షణ కరువు

- అనుమతుల్లేకుండా పది చెట్ల నరికివేత
- రాత్రికి రాత్రే కలప తరలింపు
- రూ.1.90 లక్షల విలువైన టేకు దుంగలు స్వాధీనం



ప్రజానావ, కల్లూరు : ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన కార్యాలయ ప్రాంగణంలోనే టేకు చెట్లకు రక్షణ కరవైంది. కల్లూరు ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని పది టేకు చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా నరికించి, కలపను రాత్రికి రాత్రే తరలించిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారం వెనుక అధికార పార్టీకి చెందిన ఓ నాయకుడి హస్తం ఉన్నట్లు ఆరోపణలు రావడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రజాధనంతో పాటు ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు బాధ్యత వహించాల్సిన అధికారుల కార్యాలయంలోనే ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అధికారులకు తెలియకుండానే జరిగిందా?

ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలో పది టేకు చెట్లను నరికివేసి, వాటి దుంగలను తరలించే వరకు సంబంధిత అధికారులకు తెలియకుండా ఉండటం సాధ్యమేనా? అన్న ప్రశ్నలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో కార్యాలయ ఉన్నతాధికారుల పాత్రపైనా పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. చెట్ల నరికివేతకు వర్తించే నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, ఎలాంటి అనుమతులు లేకుండా చెట్లను నరికేందుకు అవకాశం ఎలా కల్పించారన్నది తేలాల్సి ఉంది. అధికార పార్టీ నాయకుడికి ఈ వ్యవహారంలో సహకారం అందిందా? అనే అంశంపైనా సమగ్ర విచారణ జరగాలని స్థానికులు కోరుతున్నారు.

రూ.1.90 లక్షల విలువైన కలప స్వాధీనం

కల్లూరు ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలోని పది టేకు చెట్లను మండలానికి చెందిన అధికార పార్టీ నాయకుడు, ఓ సర్పంచి భర్త నరికించి, వాటి దుంగలను రాత్రికి రాత్రే తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు స్పందించారు. రఘునాథ గూడెంలోని పొలాల్లో నిల్వ ఉంచిన టేకు దుంగలను మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న కలప పరిమాణం 1.86 ఘనపు మీటర్లుగా ఉండగా, దాని విలువ సుమారు రూ.1.90 లక్షలుగా ప్రాథమికంగా అంచనా వేశారు.

నాయకుడిపై చర్యలు ఉంటాయా?

అటవీ శాఖ అధికారుల విచారణలో ఈ వ్యవహారంలో అధికార పార్టీ నాయకుడి ప్రమేయం ఉన్నట్లు తేలిన నేపథ్యంలో కలపను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలోని చెట్లను అనుమతులు లేకుండా నరికించిన వ్యవహారంలో బాధ్యులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. రాజకీయ పలుకుబడి కారణంగా చర్యల్లో జాప్యం జరుగుతుందా? లేక నిబంధనల ప్రకారం బాధ్యులపై చర్యలు చేపడతారా? అన్నది తేలాల్సి ఉంది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



దొంగల పాలవుతున్న రాజీవ్ సాగర్ సామగ్రి

- నిఘా కరువు.. పర్యవేక్షణ గాలికి
- రూ.లక్షల విలువైన పరికరాలు మాయం..
- పట్టించుకునేవారేరీ?

ప్రజానావ, భద్రాచలం : రాజీవ్ సాగర్ ప్రాజెక్టుకు చెందిన సామగ్రి దొంగల పాలవుతోంది. జలవనరుల శాఖ అధికారుల పరిధిలోనే ఉన్నప్పటికీ సరైన నిఘా, పర్యవేక్షణ లేకపోవడం అక్రమార్కులకు అవకాశంగా మారుతోంది. లక్షల రూపాయల విలువైన సామగ్రిని గ్యాస్ కట్టర్లతో ముక్కలుగా కోసి తరలిస్తూ విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రాజెక్టుకు చెందిన విలువైన ఇనుము, పైపులు ఇతర సామగ్రి భద్రతపై అధికారుల నిర్లక్ష్యం విమర్శలకు తావిస్తోంది. గతంలోనూ ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నా పరిస్థితిలో మార్పు కనిపించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పైపులు కోసి.. ట్రాక్టర్‌లో తరలింపు

ఈ నెల 4న సర్వాయిపాడు బంజర వద్ద రాజీవ్ సాగర్‌కు చెందిన పైపులను గ్యాస్ కట్టర్‌తో ముక్కలుగా కోసి ట్రాక్టర్‌లో తరలిస్తుండగా ఆరుగురు పట్టుబడ్డారు. ఈ సామగ్రి విలువ సుమారు రూ.2 లక్షలుగా అంచనా వేశారు. ప్రాజెక్టుకు చెందిన పైపులను పగటిపూటగానీ, రాత్రిపూటగానీ కోసి తరలించే పరిస్థితి నెలకొనడం భద్రతా పర్యవేక్షణలో లోపాలను ఎత్తిచూపుతోంది. సుమారు 20 ఏళ్ల క్రితం గొందిగూడెం వద్ద ప్రాజెక్టు నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలోనూ ఇలాంటి ఘటన చోటుచేసుకుంది. కొందరు అక్రమార్కులు గ్యాస్ కట్టర్లతో ప్రాజెక్టు సామగ్రిని ముక్కలుగా కోసి ఏకంగా లారీలో తరలించేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో వారు పట్టుబడగా పలువురిపై కేసులు నమోదయ్యాయి. అప్పట్లో చోరీకి గురికావాల్సిన సామగ్రి విలువ సుమారు రూ.40 లక్షలుగా ఉన్నట్లు సమాచారం. ఇంతటి విలువైన సామగ్రికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉన్నప్పటికీ పర్యవేక్షణ లోపాలు కొనసాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిరుపయోగంగా పంప్‌హౌస్

అమ్మగారిపల్లిలో రాజీవ్ సాగర్ పంప్‌హౌస్ నిర్మాణం చేపట్టారు. అయితే సీతారామ ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చిన తర్వాత రాజీవ్ సాగర్ పంప్‌హౌస్ నిరుపయోగంగా మారింది. అక్కడ సుమారు రూ.2 కోట్ల విలువైన ఇనుము, ఇసుక, కంకర తదితర నిర్మాణ సామగ్రి మిగిలిపోయింది. వాటిని సంరక్షించేందుకు తగిన చర్యలు లేకపోవడంతో అక్రమార్కుల కన్ను పడినట్లు తెలుస్తోంది. క్రమంగా సామగ్రిని కొల్లగొడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జలవనరుల శాఖ అధికారులు స్పందించి మిగిలి ఉన్న సామగ్రికి రక్షణ కల్పించడంతోపాటు, చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వాకర్స్ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే చొరవ

- జూనియర్ కళాశాల మైదానంలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

ప్రజానావ, భువనగిరి : పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో వాకర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి, మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. శుక్రవారం ఉదయం మైదానంలో మార్నింగ్ వాక్ చేసిన ఆయన, వాకర్స్‌తో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. వాకర్స్ విజ్ఞప్తి మేరకు మైదానంలో ప్రహరీ గోడ నిర్మాణం, ఓపెన్ జిమ్ ఏర్పాటు, విద్యుద్దీపాల కల్పన, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి, మరుగుదొడ్లు, పార్కింగ్ సదుపాయాల ఏర్పాటుపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి, వైస్ చైర్‌పర్సన్ మంజుల, కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఇనుప రాడ్డు ఛాతిలో గుచ్చుకొని కార్మికుడి మృతి

- శ్రీకృష్ణ పరిశ్రమలో ప్రమాదం
- బీహార్‌కు చెందిన మస్తాన్ దుర్మరణం

ప్రజానావ, జిన్నారం : ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇనుము తయారీ పరిశ్రమలో ప్రమాదం చోటుచేసుకొని కార్మికుడు మృతి చెందాడు. పరిశ్రమలో పనిచేస్తుండగా ఎర్రటి ఇనుప రాడ్డు ఛాతిలో గుచ్చుకోవడంతో బీహార్‌కు చెందిన మస్తాన్ (45) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సీఐ సుధీర్‌కుమార్ కథనం ప్రకారం.. మస్తాన్ గత కొంతకాలంగా శ్రీకృష్ణ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. విధుల్లో ఉండగా ప్రమాదవశాత్తు వేడిగా ఉన్న ఇనుప రాడ్డు ఆయన ఛాతిలోకి గుచ్చుకుంది. తీవ్ర గాయాలతో మస్తాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రభుత్వ భూముల్లో ప్రైవేటు వెంచర్లా?

- పాల్వంచలో భూముల హక్కులపై అనుమానాలు
- ప్లాట్ల విక్రయాలపై ఆరోపణలు
- పత్రాలను పరిశీలించి నోటీసులు జారీ చేస్తామన్న తహసీల్దార్



ప్రజానావ, పాల్వంచ : పాల్వంచ పట్టణంలో స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. జిల్లా కేంద్రంగా, పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో కొత్త వెంచర్లు వెలుస్తుండగా, ప్లాట్ల కొనుగోళ్లు, విక్రయాలు ఊపందుకుంటున్నాయి. ఈ క్రమంలో కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఓ సర్వే నంబరులోని భూముల వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ భూముల్లో ప్రైవేటు వ్యక్తులు వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఆయా భూముల అసలు హక్కుదారులెవరు? రెవెన్యూ రికార్డుల్లో వాటి వివరాలు ఎలా నమోదయ్యాయి? వెంచర్ల ఏర్పాటుకు అనుమతులు ఉన్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

హక్కులు ఎవరికి?

పలు సర్వే నంబర్ల పరిధిలోని మొత్తం 9,282 ఎకరాల భూములకు సంబంధించిన వ్యవహారంపై స్పష్టత రావాల్సి ఉంది. ఆయా భూములు ప్రభుత్వానికి చెందినవా? ప్రైవేటు వ్యక్తుల పేర్లపై పట్టాదారు హక్కులు ఉన్నాయా? రెవెన్యూ రికార్డుల్లో ఎలాంటి వివరాలు నమోదయ్యాయి? అనే అంశాలపై అధికారులు సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. భూములు ప్రభుత్వానికి చెందినవిగా తేలితే, వాటిలో ప్రైవేటు వెంచర్లు ఎలా ఏర్పాటయ్యాయన్నది విచారణలో వెల్లడించాలి. సంబంధిత హక్కు పత్రాలు, భూముల సర్వే వివరాలు, లేఅవుట్ అనుమతులను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంది.

అధికారుల పర్యవేక్షణ ఏది?

భూముల యాజమాన్య హక్కులను నిర్ధారించడం రెవెన్యూ శాఖ బాధ్యత కాగా, లేఅవుట్ల అనుమతులు, పట్టణ ప్రణాళిక నిబంధనల అమలును సంబంధిత శాఖల అధికారులు పరిశీలించాల్సి ఉంటుంది. ఆయా సర్వే నంబర్లపై గతంలో ఫిర్యాదులు అందాయా? క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారా? నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు ఏర్పాటు చేసినట్లు గుర్తించారా? అనే వివరాలపై స్పష్టత రావాల్సి ఉంది. భూముల విషయంలో ఎలాంటి వివాదాలు ఉన్నాయో తేల్చకుండా ప్లాట్ల విక్రయాలు కొనసాగితే కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది.

జోరుగా ప్లాట్ల విక్రయాలు

సంబంధిత సర్వే నంబరులో పలువురు వెంచర్లు ఏర్పాటు చేసి ప్లాట్లు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయా వెంచర్లకు సంబంధించిన భూముల హక్కు పత్రాలు ఏమిటి? లేఅవుట్ అనుమతులు పొందారా? కొనుగోలుదారులకు ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు చూపిస్తున్నారు? అనే అంశాలపై విచారణ జరగాల్సి ఉంది. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి భూముల యాజమాన్యంపై స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

పత్రాలు పరిశీలించి నోటీసులు

ఈ వ్యవహారంపై పాల్వంచ తహసీల్దార్ దారా ప్రసాద్ స్పందిస్తూ.. తాజాగా ఏర్పాటు చేస్తున్న ఓ వెంచర్‌పై ఫిర్యాదు అందిందని తెలిపారు. సంబంధిత నిర్వాహకులకు సమాచారం అందించి, భూములకు సంబంధించిన పత్రాలను తీసుకురావాలని సూచించినట్లు పేర్కొన్నారు. పత్రాలను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేస్తామని వెల్లడించారు.



ఆర్థిక అక్షరాస్యతపై విస్తృత అవగాహన కల్పించాలి

- డిజిటల్ మోసాల నుంచి రక్షణపై ప్రజలకు చైతన్యం కల్పించాలి
- ఈ నెల 21 నుంచి గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో ప్రత్యేక కార్యక్రమాలు
- పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రజానావ, సిరిసిల్ల: జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ మోసాల నివారణపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. భారత ప్రభుత్వం ఆర్థిక సేవల విభాగం (డీఎఫ్ఎస్) ఆదేశాల మేరకు ఈ నెల 21 నుంచి డిసెంబర్ 31 వరకు లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చనున్నట్లు తెలిపారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం లీడ్ బ్యాంకు మేనేజర్ రాజీవ్ కుమార్‌తో కలిసి కలెక్టర్ ఈ కార్యక్రమాలకు సంబంధించి న పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అత్యంత వెనుకబడిన గిరిజన కుటుంబాలకు ప్రభుత్వ ఆర్థిక పథకాలు, బ్యాంకింగ్ సేవలపై అవగాహన కల్పించడంతోపాటు, కొత్త బ్యాంకు ఖాతాల ప్రారంభానికి షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజేడీవై), ఇతర పొదుపు ఖాతాలకు రీ–కేవైసీ ప్రక్రియను పూర్తి చేయించాలని, పెండింగ్‌లో ఉన్న ఖాతాలకు సెంట్రల్ కేవైసీ (సీ–కేవైసీ) చేయించాలని కలెక్టర్ సూచించారు. పొదుపు ఖాతాలు, బ్యాంకు లాకర్లకు నామినీని తప్పనిసరిగా నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆర్థిక పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించడంతో పాటు, డిజిటల్ లావాదేవీల సమయంలో మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

మూలవాగులో కొలువుదీరిన గౌరీదేవి

శోభాయాత్రలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ప్రజానావ, వేములవాడ: వేములవాడ పట్టణంలో సద్దుల బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. మున్సిపల్ పాలకవర్గం ఆధ్వ ర్యంలో గౌరీదేవి అమ్మవారి విగ్రహ శోభాయాత్రను ఘనంగా నిర్వహిం చి, మూలవాగు బతుకమ్మ తెప్ప వద్ద అమ్మవారిని కొలువుదీర్చారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, శోభాయాత్ర వాహనాన్ని స్వయంగా నడిపారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొంటూ పట్టణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ వేములవాడలో సంప్రదాయం ప్రకారం ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ నిర్వహించడం ప్రత్యేకత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లోకేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, ప్రతాప రామకృష్ణ, మున్సిపల్ మేనేజర్ సంపత్ రెడ్డి, సానిటరీ ఇన్స్పెక్టర్ సుకుమార్, కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు, సిబ్బంది, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

వేములవాడలో అంబరాన్నంటిన

సద్దుల బతుకమ్మ సంబురాలు

- జానపద గీతాలతో మార్మోగిన ప్రధాన వీధులు
- మూలవాగు తెప్ప వద్ద బతుకమ్మల నిమజ్జనం
- రూ.34 లక్షలతో వేడుకలకు ఏర్పాట్లు
- పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్, సినీ నటులు సాయికుమార్, రామ్ జగన్

ప్రజానావ, వేములవాడ: దక్షిణ కాశీగా పేరుగాం చిన వేములవాడలో సద్దుల బతుకమ్మ వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమైన తొమ్మిది రోజుల పండుగలో ఏడవ రోజున సద్దుల బతుకమ్మను నిర్వహిం చడం వేములవాడలో అనాదిగా వస్తున్న ఆచారం. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన కూడళ్లు మహిళల ఆటపాటలు, జానపద గీతాలతో మార్మోగాయి. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చిన మహిళలు సంప్రదాయ దుస్తుల్లో వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం బతుకమ్మలను ఊరేగింపుగా మూలవాగు వద్దకు తీసుకెళ్లి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బతుకమ్మ తెప్ప వద్ద నిమజ్జనం చేశారు. మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి. గితే, సినీ నటులు సాయికుమార్, రామ్ జగన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మహిళలతో కలిసి బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ గౌరమ్మను కొలిచి పూజించే పండుగ బతుకమ్మ అని, ఆడపడుచులంతా ఒకచోట చేరి ఆనందోత్సాహాలతో జరుపుకోవడం తెలం గాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుం దని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ వేడుకలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని, వేములవాడలో పండు గను ఘనంగా నిర్వహించేందుకు రూ.34 లక్షలతో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆహ్వానం మేరకు వేముల వాడలో సద్దుల బతుకమ్మ వేడుకలకు హాజరైనట్లు సినీ నటుడు సాయికుమార్ తెలిపారు. వేములవాడలో బతుకమ్మ సంబరాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మహిళలు సంతోషంగా జరుపుకునే ప్రకృతి పండుగలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. వేములవాడలో ఆడపడుచులు పుట్టినింటి తోపాటు మెట్టినింట్లోనూ బతుకమ్మ పండుగను జరుపుకోవడం ప్రత్యేక సంప్రదాయమని పేర్కొన్నారు. ప్రతి ఏటా మూలవాగు బతుకమ్మ తెప్ప వద్ద వేడుకలను ఘనంగా నిర్వహిస్తుండటంతో పట్టణమంతా పండుగ శోభను సంతరించుకుంది. ఆటపాటలతో బతుకమ్మల ను ఆడిన మహిళలు నిమజ్జనం అనంతరం వాయినాలు ఇచ్చిపుచ్చుకుని వేడుకలను ఆనందంగా ముగించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆది శ్రీనివాస్, సినీ నటుడు సాయికుమార్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తదితరులు పాల్గొన్నారు.



కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్

- రాజీ మార్గం ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలి
- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ

ప్రజానావ, సిరిసిల్ల : ఎన్ఐ యాక్ట్ (చెక్ బౌన్స్) కేసుల పరిష్కారానికి నవంబర్ 21వ తేదీన ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, రాజీ మార్గం ద్వారా కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టు హాల్ లో సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్ సభ్యులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధి కార సంస్థ అధ్యక్షురాలు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.నీరజ మట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు నవంబర్ 21 న ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమంను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకొని, తమ కేసులను స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో మొదటి అదనపు జిల్లా జడ్జి బి.పుష్పలత, పోక్సో కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్, సీనియర్ సివిల్ జడ్జి సిరిసిల్ల, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పి. లక్ష్మణాచారి, సిరిసిల్ల, వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఆవునూరి రమాకాంతరావు, పిట్టల మనోహర్, న్యాయవాదులు పాల్గొన్నారు.



ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలి

- ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులు వరి వేయవద్దు
- వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారుల సూచన మేరకు ప్రత్యామ్నాయ పంటలు వేయాల
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- ఎల్ నినో ప్రభావం, ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపకల్పన పై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం

ప్రజానావ, సిరిసిల్ల : ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు వివిధ శాఖల అధికారులు పక్కా ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం, ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపకల్పన పై జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వ్యవసాయ, ఉద్యానవన, నీటి పారుదల, భూగర్భ జల శాఖ, ఎన్పీడీసీఎల్, మిషన్ భగీరథ, గ్రామీణ అభివృద్ధి శాఖ, మున్సిపల్ కమిష నర్లు, జిల్లా పంచాయతీ అధికారి తదితర శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వ హించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడు తూ.. ప్రాజెక్టులలో నీటిమట్టాలు క్రమంగా తగ్గడం.. భూగర్భ జలాలు రాను రాను తగ్గుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు.. వ్యవసాయ అధికారులు సూచన మేరకు రైతులు వరి వేయవద్దని సూచించారు. వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికార సూచనల మేరకు రైతులు ప్రత్యామ్నాయ పంటలు కూరగాయలు, పప్పు దినుసులు, ఆయిల్ ఫామ్ తదితర పంటల సాగుకు ముందుకు రావాలని



పిలుపునిచ్చారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు మండలాల వారీగా నీటి వనరుల లభ్యత ఆధారంగా పంటలు సాగు చేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ జలసిరి కింద బోర్ వెల్ రీఛార్జి గుంతలు, పామ్ పాండ్, మ్యాజిక్ సోక్ పిట్ తదితర పనులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని ఆదేశించారు. మిషన్ భగీరథ అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకో వాలని, యంత్రాలు ఇతర ఏర్పాట్లు ఇప్పటి నుంచే చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని ఆయా మునిసిపాలిటీలు, గ్రామపంచాయతీలకు అవస రమైన నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ఆలాగే నీటి వృథాను అరికట్టాలని సూచించారు. అన్ని నల్లాలకు ఆన్ ఆఫ్ స్విచ్లు ఉండేలా చూసుకో వాలని ఆదేశించారు. ఎన్ పీడీసీఎల్ అధికారులు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జీవాలకు అవసరమైన గడ్డి, నీటి తొట్టిల నిర్వహణ పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. గడ్డి పెంపకానికి కావలసిన అన్ని విత్తనాలు ముందస్తుగా సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, సంబంధిత జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మూడు రోజుల్లో రెండు విజయాలు

- జడ్జిగా హారిక
- ఏపీపీగా ఎంపికైన కొద్ది రోజులకే జూనియర్ సివిల్ జడ్జిగా మరో ఘనత

ప్రజానావ, పెద్దపల్లి: పట్టుదలతో చదివి లక్ష్యాన్ని సాధించవచ్చని పెద్దపల్లి మండలానికి చెందిన ఇద్దరు యువతులు నిరూపించారు. ఇటీవల విడుదలైన జూనియర్ సివిల్ జడ్జి పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరిచి న్యాయమూర్తులుగా ఎంపికై ప్రశంసలు అందుకుంటున్నారు. వీరిలో రాఘవాపూర్‌కు చెందిన వేముల హారిక ప్రత్యేకంగా నిలిచారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ)గా ఎంపికైన మూడు రోజుల వ్యవధిలోనే జూనియర్ సివిల్ జడ్జిగా కూడా ఎంపికై మరో విజయాన్ని సొంతం చేసుకున్నారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన వేముల వైకుంఠం, లక్ష్మి దంపతుల కుమార్తె హారిక ఇటీవల ఏపీపీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ఆ పోస్టుకు ఎంపికయ్యారు. ఆ ఆనందం నుంచి తేరుకోకముందే గురువారం విడుదలైన జూనియర్ సివిల్ జడ్జి పరీక్షా ఫలితా ల్లోనూ సత్తా చాటి న్యాయమూర్తిగా ఎంపికయ్యా రు. తక్కువ వ్యవధిలో రెండు కీలక విజయాలు సాధించడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రు లు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన చిప్ప రాజేశ్వర్, లలిత దంపతుల కుమార్తె చిప్ప సౌమ్య కూడా జూనియర్ సివిల్ జడ్జి పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ఎంపిక య్యారు. ఒకే మండలానికి చెందిన ఇద్దరు యువ తులు న్యాయమూర్తులుగా ఎంపిక కావడం స్థాని కంగా ఆనందాన్ని నింపింది. వారి విజయంపై పద్మశాలి సంఘం నాయకులు, కులస్తులు, గ్రామస్థులు అభినందనలు తెలియజేస్తున్నారు.

డీలిమిటేషన్ బిల్లుకు మళ్లీ కసరత్తు!

- **2029 ఎన్నికలకు ముందే ఆమోదం పొందాలని ఎన్డీయే వ్యూహం?**
- **మహిళా బిల్లు, జమిలి ఎన్నికలపైనా దృష్టి**
- **విపక్షాల్లో మారుతున్న సమీకరణాలపై ఆశలు**



న్యూఢిల్లీ : నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లుకు పార్లమెంటు ఆమోదం పొందేందుకు కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రయత్నాలు ప్రారంభించినట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. గత ఏప్రిల్‌లో లోక్‌సభలో వీగిపోయిన ఈ బిల్లును తిరిగి ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని ఎన్డీయే ప్రభుత్వం భావిస్తున్నట్లు సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ వార్తలు వస్తున్నాయి. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే డీలిమిటేషన్, ఒక దేశం–ఒక ఎన్నిక (జమిలి) బిల్లులకు పార్లమెంటరీ ఆమోదం పొందే దిశగా వ్యూహరచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నెలాఖరులో పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి డీలిమిటేషన్‌తో పాటు మహిళా బిల్లును కూడా ఆమోదింపజేయాలని అధికార కూటమి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

మారుతున్న రాజకీయ సమీకరణాలు

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల అనంతరం మారిన రాజకీయ పరిణామాలు డీలిమిటేషన్ బిల్లుపై చర్చకు కారణమవుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుతో తృణమూల్ కాంగ్రెస్ రాజకీయంగా ఎదురుదెబ్బ తిన్నదని కథనాలు పేర్కొంటున్నాయి. ఆ పార్టీకి చెందిన కొందరు ఎంపీలు రాజీనామా చేయడం, మరికొందరు అధికార పక్షంలో చేరినట్లు వార్తలు రావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మహారాష్ట్రలో శివసేన (యూబీటీ) ఎంపీల విషయంలోనూ ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్నట్లు సమాచారం. తమిళనాడులో డీఎంకే ప్రభుత్వానికి ఎదురైన ఎన్నికల ఫలితాలు, కాంగ్రెస్‌తో ఆ పార్టీ సంబంధాలపై నెలకొన్న పరిణామాలు కూడా రాజకీయ సమీకరణాలను ప్రభావితం చేస్తున్నాయి. గత ఏప్రిల్‌లో లోక్‌సభలో డీలిమిటేషన్ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు టీఎంసీ, డీఎంకే ఎంపీలు వ్యతిరేకంగా ఓటేసినట్లు కథనాలు వెల్లడించాయి. అయితే ప్రస్తుతం మారిన పరిస్థితుల నేపథ్యంలో బిల్లుకు మద్దతు కూడగట్టేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపినట్లు జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. డీఎంకేతో పాటు ఎనిమిది మంది రాజ్యసభ సభ్యుల బలం ఉన్న ఎన్సీపీ (శరద్ పవార్) వర్గంతోనూ సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఈ పరిణామాలు బిల్లుకు అవసరమైన మద్దతు సమీకరణంపై ఆసక్తిని పెంచుతున్నాయి.

ప్రత్యేక మెజారిటీ తప్పనిసరి

డీలిమిటేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులు ఆమోదం పొందాలంటే పార్లమెంటు ఉభయ సభల్లో ప్రత్యేక మెజారిటీ అవసరం. సభ మొత్తం సభ్యులలో సగానికి పైగా హాజరై ఉండాలి. హాజరై ఓటు వేసిన సభ్యుల్లో మూడింట రెండు వంతుల మంది బిల్లుకు మద్దతు తెలపాలి. లోక్‌సభలో 540 మంది సభ్యులు హాజరై ఓటు వేస్తే కనీసం 360 మంది మద్దతు అవసరం. రాజ్యసభలో 244 మంది సభ్యులు హాజరైతే కనీసం 163 మంది అనుకూలంగా ఓటేయాలి. ఆమోదం పొందిన రాజ్యాంగ సవరణ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించిన తర్వాతే అది చట్టరూపం దాలుస్తుంది. అయితే, ప్రస్తుతం ఉభయ సభల్లోనూ ఎన్డీయేకు అవసరమైన ప్రత్యేక మెజారిటీ లేదని కథనం పేర్కొంటోంది. లోక్‌సభలో ఎన్డీయేకు 319 మంది, రాజ్యసభలో 151 మంది సభ్యుల మద్దతు ఉన్నట్లు అందులో వివరించింది. ఈ సంఖ్యల్లో టీఎంసీ, శివసేన (యూబీటీ) ఎంపీల మద్దతును కూడా కలిపినట్లు పేర్కొన్న నేపథ్యంలో, ఆయా పార్టీల ప్రస్తుత వైఖరి, సభ్యుల వాస్తవ మద్దతు కీలకంగా మారనున్నాయి. బిల్లుకు అవసరమైన మెజారిటీ సాధించాలంటే ఇతర పార్టీల మద్దతు కూడగట్టడం కేంద్ర ప్రభుత్వానికి ప్రధాన సవాలుగా నిలవనుంది.

ఢిల్లీలో ఘనంగా తెలంగాణ బతుకమ్మ సంబురాలు



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ
రెసిడెంట్ కమిషనర్ అద్వైత్ కుమార్ సింగ్

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా జరిగిన ఈ వేడుకల్లో ఢిల్లీలో నివసిస్తున్న తెలంగాణవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలు, మహిళల ఆటపాటలతో తెలంగాణ భవన్ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. గౌరీపూజతో వేడుకలు ప్రారంభమయ్యాయి. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్, ప్రత్యేక కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, పల్లె జీవనం, ప్రకృతిపై ప్రజలకు ఉన్న ప్రేమకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. అందరూ ఒకచోట చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఆనందాన్ని పంచుకోవడం ఈ పండుగ ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఢిల్లీలో ఉంటున్నప్పటికీ ఇలాంటి వేడుకలు తెలంగాణతో ఉన్న అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. బతుకమ్మల కోసం పూలను సేకరించి అందంగా పేర్చడం నుంచి ఆటపాటలతో వేడుకలకు శోభ తీసుకురావడం వరకు మహిళలు చూపుతున్న ఆసక్తిని ఆయన అభినందించారు. పిల్లలకు తెలంగాణ పండుగలు, పాటలు, ఆచారాలను పరిచయం చేయడం ద్వారా సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని సూచించారు. మహిళలు బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా ఆడిపాడారు. తెలంగాణ భవన్ అధికారులు, సిబ్బంది కూడా వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

గాల్లో విన్యాసాలు చేసే టెస్లా రోడ్‌స్టర్

- **రాకెట్ సాంకేతికతతో ఎగిరే కారు? రెండోతరం రోడ్‌స్టర్‌పై ఆసక్తికర చర్చ**
- **గంటకు 100 కి.మీ. వేగం 0.81 సెకన్లలోనే సాధిస్తుందన్న మస్క్**
- **2028లో విడుదలకు సన్నాహాలు?**



టెక్సాస్: కార్ల తయారీలో సరికొత్త ఆవిష్కరణలకు పేరుగాంచిన టెస్లా మరోసారి వార్తల్లో నిలిచింది. రెండోతరం రోడ్‌స్టర్ కారుకు సంబంధించిన వీడియోతో కంపెనీ అధినేత ఎలాన్ మస్క్ ఆసక్తి రేకెత్తించారు. రాకెట్ సాంకేతికతను పోలిన అధునాతన ఫీచర్లతో ఈ ఎలక్ట్రిక్ సూపర్‌కార్‌ను రూపొందిస్తున్నట్లు గతంలో ప్రకటించారు. తాజాగా టెక్సాస్‌లోని స్పేస్‌ఎక్స్ రాకెట్ అభివృద్ధి కేంద్రంలో జరిగిన ప్రదర్శనకు సంబంధించిన వీడియో చర్చనీయాంశమైంది. ప్రత్యేకంగా రూపొందించిన ర్యాంప్‌పై కారు విన్యాసాలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే కారు నిజంగా గాల్లో ఎగిరిందా, వీడియోలో చూపించింది ర్యాంప్‌పై చేసిన విన్యాసమేనా అన్నది అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. రోడ్‌స్టర్ పనితీరుపై టెస్లా గతంలోనే భారీ అంచనాలను ప్రకటించింది. గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని కేవలం 0.81 సెకన్లలో అందుకోగలదని మస్క్ పేర్కొన్నట్లు కథనాలు వెల్లడిస్తున్నాయి. గాల్లో బారెల్ రోల్ వంటి విన్యాసాలు చేయడం, భారీ సెమీ ట్రక్కును దూకి దాటడం వంటి అంశాలు కూడా ప్రచారంలో ఉన్నాయి. అయితే ఈ సామర్థ్యాలకు సంబంధించిన పూర్తి సాంకేతిక వివరాలు, పరీక్షల ఆధారాలు అందుబాటులోకి రావాల్సి ఉంది. స్పేస్‌ఎక్స్‌కు చెందిన రాకెట్ సాంకేతికతను ఉపయోగించి రోడ్‌స్టర్‌లో ప్రత్యేక ఫీచర్లు అందించే ఆలోచనను మస్క్ గతంలో ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో కొత్త రోడ్‌స్టర్‌పై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ కారు 2028లో విడుదల కావచ్చని ప్రచారం జరుగుతున్నప్పటికీ, విడుదల తేదీ, గాల్లో ఎగిరే సామర్థ్యం వంటి అంశాలపై టెస్లా అధికారిక ప్రకటనతోనే స్పష్టత రానుంది.

ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు వివరాలిస్తే ప్రైవేట్ ఫిర్యాదు చేయొచ్చు

ప్రజాప్రతినిధుల చట్టం కింద క్రిమినల్ ఫిర్యాదులకు అవకాశం: సుప్రీంకోర్టు స్పష్టీకరణ



న్యూఢిల్లీ : ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన అభ్యర్థులు తమ ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు వివరాలు సమర్పిస్తే, వారిపై ప్రైవేట్ వ్యక్తులు క్రిమినల్ ఫిర్యాదులు దాఖలు చేయవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇలాంటి ఫిర్యాదుల విషయంలో క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 195 కింద ఉన్న ఆంక్షలు అడ్డుకావని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ షీల్ నాగు ధర్మాసనం పేర్కొంది. కొన్ని నిర్దిష్ట క్రిమినల్ నేరాలపై సంబంధిత కోర్టు లిఖితపూర్వక ఫిర్యాదు చేసినప్పుడే న్యాయస్థానాలు విచారణకు స్వీకరించాలనే నిబంధనను సెక్షన్ 195 నిర్దేశిస్తుంది. అయితే, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 125ఏ కింద నేరం జరిగిందని ఆరోపిస్తూ దాఖలయ్యే ప్రైవేట్ ఫిర్యాదులకు ఈ ఆంక్షలు వర్తించవని ధర్మాసనం అభిప్రాయపడింది. ఎన్నికైన అభ్యర్థిని వేధించాలనే ఉద్దేశంతో ఫిర్యాదు చేసినా, నిరాధారమైన ఆరోపణలు చేసినా, పరిస్థితులకు అనుగుణంగా తగిన ఉత్తర్వులు జారీ చేసే అధికారం మెజిస్ట్రేట్‌లకు ఉంటుందని సుప్రీంకోర్టు తెలిపింది.

మహిళా అధికారిపై ఐఏఎస్ అధికారి ఆగ్రహం

- **సమీక్షా సమావేశంలో దురుసు వ్యాఖ్యలు**
- **సస్పెన్షన్ ఉత్తర్వులు టైప్ చేయాలని ఆదేశం**

న్యూఢిల్లీ : జమ్ముకశ్మీర్‌లో 'మిషన్ యువ' సమీక్షా సమావేశంలో ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి మహిళా అధికారిపై చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. అక్టోబర్ 14న కార్మిక, ఉపాధి కల్పన శాఖ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ రంజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అదే శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కశ్మీర్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అధికారి బీనిష్ వాణి వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్నారు. పథకం అమలులో జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) పాత్రపై చర్చ సందర్భంగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు సమాచారం. ఎన్ఆర్ఎల్ఎం సహాయం ఎందుకు తీసుకుంటున్నారని, తన పనిని ఇతరులకు అప్పగిస్తున్నారని రంజన్ ప్రశ్నించినట్లు తెలిసింది. దీనికి బీనిష్ వాణి స్పందిస్తూ.. పథకం అమలులో వారి సహకారం అవసరమని, తమ లక్ష్యాన్ని పూర్తి చేశామని వివరించారు. దీంతో ఆగ్రహించిన రంజన్ ఆమెను మాట్లాడవద్దంటూ గట్టిగా మందలించారని, అనుచిత పదజాలం ఉపయోగించారని కథనాలు పేర్కొన్నాయి. తనపై చేసిన వ్యాఖ్యలను వాణి ప్రశ్నించడంతో, ఆమె సస్పెన్షన్ ఉత్తర్వులు టైప్ చేయాలని మరో అధికారిని రంజన్ ఆదేశించినట్లు సమాచారం. దీనికి వాణి స్పందిస్తూ తనను సస్పెండ్ చేసుకోవచ్చని బదులిచ్చారు. అనంతరం రంజన్ ఆమెను సమావేశం నుంచి వెళ్లిపోవాలని గట్టిగా చెప్పగా, వాణి కూడా తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ సమావేశం నుంచి నిష్క్రమించారు. 2010 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి రంజన్ గతంలోనూ పలు వివాదాల్లో చిక్కుకున్నట్లు కథనాలు వెల్లడించాయి.

మూడేళ్ల బాలికపై అత్యాచారం, హత్య

- **11 నెలల్లో నిందితుడికి మరణశిక్ష**

ప్రజానావ, ముంబై: : మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా మాలేగావ్ తాలూకా డోంగ్రాలేలో మూడేళ్ల బాలికపై అత్యాచారం చేసి హత్య చేసిన కేసులో నిందితుడు విజయ్ ఖైర్నార్ (24)కు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు మరణశిక్ష విధించింది. 2025 నవంబర్ 16న చాక్లెట్ ఆశ చూపి బాలికను అపహరించిన నిందితుడు అత్యాచారం చేసి, రాయితో కొట్టి హత్య చేసినట్లు విచారణలో తేలింది. 24 మంది సాక్షులను విచారించిన అనంతరం కోర్టు ఈ తీర్పు వెలువరించింది. బాధితురాలి తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఉజ్జ్వల్ నికమ్ వాదనలు వినిపించారు. తీర్పుపై నిందితుడికి 30 రోజుల్లో అప్పీల్ చేసుకునే అవకాశం ఉంది.



ఢిల్లీలో జాతీయ జెండాలతో మెరుపు నిరసనలు

- **సీఈసీ రాజీనామా చేయాలని, 'సర్'ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్**
- **సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, ఏఐఎస్ఏ అధ్యక్షురాలు నేహా బోరా అదుపులోకి**

న్యూఢిల్లీ : భారీ పోలీసు బందోబస్తు మధ్య సెంట్రల్ ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్, మండీ హౌస్ ప్రాంతాల్లో శుక్రవారం మెరుపు నిరసనలు జరి గాయి. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) మద్దతుదా రులు, విద్యార్థి సంఘాల సభ్యులు జాతీయ జెండాలు పట్టుకుని నిరసనల్లో పాల్గొన్నారు. కన్నాట్ ప్లేస్ లోపలి వలయం గుండా తిరుగుతూ 'జై హింద్' నినాదాలు చేశారు. కొందరు జాతీయ గీతాన్ని ఆలపించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సమీక్ష (సర్)ను వెనక్కి తీసుకోవాలని, 2023 ఎన్నికల కమిషనర్ల నియామక చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత విద్యార్థుల సంఘం (ఏఐఎస్ఏ) సభ్యులు మండీ హౌస్ వద్ద నిరసన చేపట్టారు. కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌లో సాయంత్రం ఐదు గంటలకు నిర్వహించ తలపెట్టిన 'లెట్రో దో తిరంగా' (త్రివర్ణ పతాకాన్ని ఎగరవేద్దాం) కార్యక్రమానికి ముందు సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, ఏఐఎస్ఏ అధ్యక్షురాలు నేహా బోరాను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఝండేవాలన్‌లోని నివాసం నుంచి దీప్కేను, మండీ హౌస్ వద్ద నేహా బోరాను అదుపులోకి తీసుకున్నారు. ఈ సమయంలో అక్కడ గుమిగూడిన ప్రజలు, మీడియా కెమెరా బృందాలు, భద్రతా సిబ్బంది మధ్య తోపులాటతో కొంత గందరగోళం నెలకొంది. నిరసనకారులను చెదరగొట్టే క్రమంలో పోలీసులకు, వారికి మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. కన్నాట్ ప్లేస్, పరిసర ప్రాంతాల్లో భారీగా ప్రజలు గుమికూడడాన్ని నిషేధిస్తూ భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 కింద ఆంక్షలు విధించినందున ప్రదర్శనకు అనుమతి నిరాకరించినట్లు పోలీసులు తెలిపారు. న్యూఢిల్లీ ప్రాంతంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా 6,000 మందికి పైగా ఢిల్లీ పోలీసు సిబ్బందిని, సుమారు 100 మంది సిబ్బంది ఉండే 220 కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సీఏపీఎఫ్) కంపెనీలను మోహరించారు.

ఓటర్ల జాబితాపై ఈసీ కీలక మార్పులు

- **17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ప్రత్యేక సారాంశ సమీక్ష**
- **శోధించగలిగే పీడీఎఫ్ ప్రతులూ అందజేత**

న్యూఢిల్లీ : ప్రత్యేక సమగ్ర సమీక్ష (సర్) ప్రక్రియపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం కీలక మార్పులకు శ్రీకారం చుట్టినట్లు కనిపిస్తోంది. గత కొంతకాలంగా వివాదాలకు కారణమైన రెండు అంశాలపై తన వైఖరిని సడలించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కొత్త ఓటర్ల నమోదుకు ప్రత్యేక సారాంశ సమీక్ష (ఎస్ఎస్ఆర్) చేపట్టనున్నట్లు ప్రకటించింది. అంతేకాకుండా తొలిసారిగా తుది ఓటర్ల జాబితాల శోధించగలిగే పీడీఎఫ్ ప్రతులను రాజకీయ పార్టీలకు అందజేస్తామని హామీ ఇచ్చింది. ఈ రెండు అంశాలపై ప్రతిపక్షాలు గత కొన్నేళ్లుగా అభ్యంత రాలు వ్యక్తం చేస్తున్నాయి. 2018లో కాంగ్రెస్ సుప్రీంకోర్టును ఆశ్రయించిన అనంతరం, గోప్యతా సమస్యలను ప్రస్తావిస్తూ యంత్రాల ద్వారా చదవగలిగే ఓటర్ల జాబితాలను విడుదల చేయడాన్ని ఎన్నికల సంఘం వ్యతిరేకించింది. ఇప్పటివరకు కేవలం స్కాన్ చేసిన పీడీఎఫ్ ప్రతులనే అందించేది. వాటిలోని పేర్లు, వివరాలను నేరుగా శోధించడం, ఎంచుకోవడం లేదా కాపీ చేయడం సాధ్యమయ్యేది కాదు. తాజాగా శోధించగలిగే పీడీఎఫ్ ప్రతులను అందించేందుకు అంగీకరించడం ద్వారా ఎన్నికల సంఘం తన గత వైఖరిలో మార్పు తీసుకొచ్చినట్లు స్పష్టమవుతోంది.

అమెరికా–పాక్ యుద్ధం వస్తే పాకిస్థాన్‌కు మద్దతిస్తాం

- **రాజస్థాన్ బీజేపీ అధ్యక్షుడు మదన్ రాథోడ్ వ్యాఖ్యలు**
- **విపక్షాల విమర్శలు**

జైపూర్ : అమెరికా–పాకిస్థాన్ మధ్య యుద్ధం ఏర్పడితే భౌగోళిక సామీప్యత దృష్ట్యా బీజేపీ పాకిస్థాన్‌కు మద్దతు ఇస్తుందని రాజస్థాన్ బీజేపీ అధ్యక్షుడు మదన్ రాథోడ్ వ్యాఖ్యానించారు. ఓ బహిరంగ కార్యక్రమంలో మాట్లాడుతూ.. అమెరికా, పాకిస్థాన్ మధ్య యుద్ధం వస్తే పాకిస్థాన్ మన పొరుగుదేశం కాబట్టి దానికి మద్దతుగా నిలుస్తామని పేర్కొన్నారు. అయితే, భారత్–పాకిస్థాన్ మధ్య సమస్యలు తలెత్తినప్పుడు మాత్రం భారతదేశం పక్షాన నిలబడతామని అన్నారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్‌తో పాటు ఇతర విపక్ష పార్టీలు విమర్శలు గుప్పించాయి.


రాత్రివేళల్లోనూ సూర్యకాంతి

- **హైదరాబాద్ స్టార్టప్‌తో అమెరికా సంస్థ ఒప్పందం**
- **కక్ష్యలో భారీ ప్రతిబింబ అద్దాలతో ఉపగ్రహాలు**
- **అవసరమైన ప్రాంతాలకు వెలుతురు అందించే ప్రణాళిక**
- **విపత్తుల సమయంలో సహాయక చర్యలకు ఉపయోగం**
- **స్కైరూట్ విక్రమ్ రాకెట్ల ద్వారా ప్రయోగాలు**

వాషింగ్టన్ : ఇకపై రాత్రివేళల్లోనూ భూమిపై నిర్దిష్ట ప్రాంతాలకు సూర్యకాంతిని అందించే సాంకేతికత అందుబాటులోకి తీసుకురావాలని అమెరికాకు చెందిన రిఫ్లెక్ట్ ఆర్బిటాల్ సంస్థ ప్రణాళికలు రూపొందిస్తున్నది. ఈ ప్రాజెక్టు కోసం హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. కక్ష్యలో భారీ ప్రతిబింబ అద్దాలతో కూడిన ఉపగ్రహాలను ప్రవేశపెట్టి, అవసరమైనప్పుడు భూమిపై ఎంపిక చేసిన ప్రాంతాలకు సూర్యకాంతిని మళ్లించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం. ఉపగ్రహాల ప్రయోగాల కోసం స్కైరూట్ రూపొందించిన విక్రమ్ రాకెట్ల సేవలను వినియోగించుకోనున్నారు.

విపత్తుల వేళ వెలుతురు

ప్రకృతి విపత్తులు సంభవించిన ప్రాంతాల్లో సహాయక, గాలింపు చర్యలకు వెలుతురు అందించడం, సౌర విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తికి అనుకూల సమయాన్ని పెంచడం వంటి అవసరాలకు ఈ సాంకేతికతను వినియోగించాలని సంస్థ భావిస్తోంది. సుమారు ఐదు కిలోమీటర్ల వెడల్పు గల ప్రాంతంలో వెలుతురును అందించడం, దాని తీవ్రతను సర్దుబాటు చేయడం, అవసరమైనప్పుడు నిలిపివేయడం ఈ వ్యవస్థ ప్రత్యేకతలుగా పేర్కొంటోంది. మారుమూల పారిశ్రామిక ప్రాంతాల్లో పనివేళలను పొడిగించడం, కీలక మౌలిక సదుపాయాల వద్ద వెలుతురు కల్పించడం, బహిరంగ కార్యక్రమాలకు ప్రత్యేక అనుభూతిని అందించడం వంటి ప్రయోజనాలు ఉంటాయని సంస్థ చెబుతోంది.



స్కైరూట్ ద్వారా ఉపగ్రహ ప్రయోగాలు

ఈ ప్రాజెక్టులో భాగంగా రెండు ఉపగ్ర హ ప్రయోగాల కోసం స్కైరూట్ ఏరోస్పేస్‌తో ఒప్పందం కుదుర్చుకు న్నట్లు రిఫ్లెక్ట్ ఆర్బిటాల్ వెల్లడించింది. ఈ ఉపగ్ర హాలను స్కైరూట్ రూపొందించిన విక్రమ్ రాకెట్ల ద్వారా కక్ష్యలోకి ప్రవేశపెట్టనున్నారు. అంతరిక్ష సాంకేతికతతో భూమిపై కొత్త అవకాశా లను సృష్టించే ప్రయత్నా ల్లో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని స్కైరూట్ ఏరోస్పేస్ సీఈవో పవన్ చందన పేర్కొన్నారు. అవసరమైనప్పుడు సూర్యకాంతిని అందించాలన్న రిఫ్లెక్ట్ ఆర్బిటాల్ ఆలోచనను తమ రాకెట్ల ద్వారా సాకారం చేసేందుకు ఎదురుచూస్తున్నామని తెలిపారు. అయితే, రాత్రివేళల్లో సూర్యకాంతిని మళ్లించే ఈ సాంకేతికత ఇంకా అభివృద్ధి, ప్రయోగ దశల్లోనే ఉంది. దీని వాస్తవ సామర్థ్యం, ఖర్చు, పర్యావరణంపై ప్రభావం, విస్తృత వినియోగానికి అవసరమైన సాంకేతిక సవాళ్లపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

అమెరికాలో పాఠశాలలో కాల్పులు.. నలుగురు మృతి

- **ముగ్గురు చిన్నారులు, ఓ ఉపాధ్యాయుడు దుర్మరణం**
- **దుండగుడిని హతమార్చిన మరో వ్యక్తి**

న్యూయార్క్: అమెరికాలోని ఒరెగాన్ రాష్ట్రంలో పాఠశాలలో కాల్పుల ఘటన కలకలం రేపింది. బెండ్ నగరంలోని సిల్వర్ రైల్ ఎలిమెంటరీ స్కూల్‌లోకి చొరబడిన 16 ఏళ్ల అనుమానితుడు కాల్పులకు తెగబడినట్లు కథనం. ఈ ఘటనలో ముగ్గురు చిన్నారులు, ఓ ఉపాధ్యాయుడు మృతిచెందినట్లు సమాచారం. మృతిచెందిన పిల్లల వయసు 11 ఏళ్లలోపే ఉన్నట్లు తెలుస్తోంది. కాల్పులకు పాల్పడిన అనుమానితుడిని మరో వ్యక్తి హతమార్చినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనలో 54 ఏళ్ల ఉపాధ్యాయుడు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు కథనం పేర్కొంది. అయితే కాల్పులకు పాల్పడిన వ్యక్తికి పాఠశాలతో ఏమైనా సంబంధం ఉందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



ఒకే జట్టులో అమ్మాయిలు, అబ్బాయిలు!

క్రికెట్‌లో కొత్త ప్రయోగం.. నవంబర్ 14 నుంచి కొలంబోలో తొలి మిక్స్‌డ్ జెండర్ టోర్నీ

కొలంబో: క్రికెట్‌లో సరికొత్త ప్రయోగంగా అబ్బాయిలు, అమ్మాయిలు ఒకే జట్టులో ఆడే తొలి మిక్స్‌డ్ జెండర్ టోర్నమెంట్ నవంబర్ 14 నుంచి 29 వరకు కొలంబోలో జరగనుంది. సిన్హలీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో నిర్వహించే ఈ పోటీల్లో 13 నుంచి 21 ఏళ్ల వయసున్న 160 మంది యువ క్రికెటర్లు పాల్గొంటారు. నాలుగు ఖండాల జట్లుగా విభజించే ఒక్కో జట్టులో 20 మంది అమ్మాయిలు, 20 మంది అబ్బాయిలు ఉంటారు. ఇరు విభాగాల ఆటగాళ్లు సాధించిన పరుగులను కలిపి జట్టు స్కోరుగా పరిగణిస్తారు. ఒక్కో జట్టు రెండుసార్లు బ్యాటింగ్ చేసే ఈ మ్యాచ్‌లు ఒక్కరోజులోనే పూర్తవుతాయి. తొలి 40 ఓవర్లను పగటిపూట ఎరుపు బంతితో, చివరి 40 ఓవర్లను ఫ్లడ్‌లైట్ల వెలుతురులో తెలుపు బంతితో ఆడతారు. తొలి అర్ధభాగం స్కోరును రెండో అర్ధభాగానికి కలుపుతారు. 'పారిటీ రూల్' ప్రకారం, ఫ్లడ్‌లైట్ల వెలుతురులో అమ్మాయిల పరుగులు అబ్బాయిల విజయాన్ని, అబ్బాయిల పరుగులు అమ్మాయిల విజయాన్ని నిర్ణయిస్తాయి. ప్రసారంలోనూ ఇరు విభాగాలకు సమాన సమయం కేటాయిస్తామని టోర్నీ వ్యవస్థాపకుడు గౌరవ్ బహిర్వాణి తెలిపారు. ఇదిలాఉంటే టోర్నీ సలహా మండలిలో ఏబీ డివిలియర్స్, మాథ్యూ హేడెన్, సర్ క్లైవ్ లాయిడ్ ఉండగా.. గ్లోబల్ సెలక్షన్ కమిటీకి ఢిల్లీ కోచ్ రాజ్‌కుమార్ శర్మ అధ్యక్షత వహిస్తారు. నిర్వహణ బాధ్యతలను మైక్ ఫోర్డ్‌హామ్ పర్యవేక్షించనున్నారు.

సెలక్టర్ పదవికి జాఫర్ దరఖాస్తు

• బీసీసీఐలో ఓజాను కొనసాగించేందుకు మద్దతు



న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు సీనియర్ సెలక్టర్ పదవికి మాజీ ఓపెనర్ వసీం జాఫర్ దరఖాస్తు చేసుకున్నారు. అజిత్ అగార్కర్ కాంట్రాక్టును పునరుద్ధరించకూడదని బీసీసీఐ నిర్ణయించడంతో ఖాళీ అయిన ఈ పదవికి ఆయన పోటీలో నిలిచారు. ఈ విషయాన్ని జాఫర్ పీటీఐకి ధ్రువీకరించారు. 48 ఏళ్ల జాఫర్ భారత్ తరఫున 31టెస్టులు ఆడి దాదాపు 2వేల పరుగులు సాధించారు. ఇందులో ఐదు శతకాలు ఉన్నాయి. వెస్టిండీస్‌పై ద్విశతకంతోపాటు దక్షిణా ఫ్రికాపై శతకం సాధించిన ఆయన.. పాకిస్థాన్‌పై కోల్‌కతాలో మరో ద్విశతకం బాదారు. క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) సభ్యులైన అశోక్ మల్హోత్రా, జతిన్ పరాంజపే దరఖాస్తులను పరిశీలించి ఎంపికపై నిర్ణయం తీసుకోనున్నారు. ప్రస్తుత ఎంపిక విధానం ప్రకారం, అత్యధిక టెస్టులు ఆడిన జోన్ ప్రతినిధికి సెలక్షన్ కమిటీ చైర్మన్ పదవి చేపట్టే అవకాశం ఉంటుంది. భారత్ తరఫున 24 టెస్టులు ఆడిన ప్రజ్ఞాన్ ఓజా కంటే జాఫర్‌కు మెరుగైన అనుభవం ఉంది. అయితే, ఓజాను చైర్మన్‌గా కొనసాగించేందుకు బీసీసీఐలో బలమైన మద్దతు ఉన్నట్లు సమాచారం.

ఫార్మాట్ ఆధారంగానే కేటగిరీలు

• ట్రై సిరీస్ తర్వాతే పాక్ క్రికెటర్లకు కాంట్రాక్టులు

లాహోర్: పాకిస్థాన్ క్రికెటర్లకు కొత్త సెంట్రల్ కాంట్రాక్టుల జారీ మరింత ఆలస్యం కానుంది. స్వదేశంలో ఈ నెల 18 నుంచి 31 వరకు జరిగే వన్డే త్రిసిరీస్ ముగిసిన తర్వాతే ఆటగాళ్ల కాంట్రాక్టులపై తుది నిర్ణయం తీసుకోవాలని జట్టు ప్రధాన కోచ్ మైక్ హెసన్, సెలక్టర్లు భావిస్తున్నారు. ఈ సిరీస్‌లో శ్రీలంక, ఇంగ్లండ్ జట్లు పాల్గొననున్నాయి. రావల్పిండి, లాహోర్ వేదికలుగా మ్యాచ్‌లు జరగనున్నాయి. అంతర్జాతీయ మ్యాచ్‌లతో పాటు ప్రస్తుతం జరుగుతున్న దేశవాళీ ఫస్ట్‌క్లాస్ పోటీల్లో ఆటగాళ్ల ప్రదర్శనలను కూడా కోచ్, సెలక్టర్లు పరిశీలించనున్నట్లు పీసీబీ వర్గాలు తెలిపాయి.

భువనేశ్వర్ రీఎంట్రీ

• అర్ష్‌దీప్‌కు గాయం.. నాలుగేళ్ల తర్వాత జట్టులోకి సీనియర్ పేసర్ • నేడు వెస్టిండీస్‌తో నిర్ణయాత్మక టీ20 పోరు



బెంగళూరు: టీమిండియా సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ నాలుగేళ్ల విరామం తర్వాత అంతర్జాతీయ టీ20ల్లో పునరాగమనానికి సిద్ధమయ్యాడు. వెస్టిండీస్‌తో శనివారం జరిగే ఐదో, చివరి టీ20కి గాయపడిన అర్ష్‌దీప్ సింగ్‌కు ప్రత్యామ్నాయంగా భువనేశ్వర్‌ను జట్టులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన నాలుగో టీ20 సందర్భంగా అర్ష్‌దీప్ బౌలింగ్ చేసే భుజానికి గాయమైంది. అతడు తుది మ్యాచ్‌లో ఆడడంపై నిర్ణయాన్ని కోలుకునే స్థితిని బట్టి మ్యాచ్ రోజున తీసుకుంటామని బీసీసీఐ వెల్లడించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్ ప్రస్తుతం 2–2తో సమంగా ఉండటంతో శనివారం బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగే పోరు నిర్ణయాత్మకం కానుంది.

చిన్నస్వామిలోనే తొలి మ్యాచ్.. పునరాగమనం

36ఏళ్ల భువనేశ్వర్ చివరిసారిగా 2022 నవంబరు 22న న్యూజిలాండ్‌తో నేపియర్‌లో టీ20 అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. 2012లో పాకిస్థాన్‌తో ఇదే చిన్నస్వామి స్టేడియంలో టీ20 అరంగేట్రం చేశాడు. ఆ మ్యాచ్‌లో 4 ఓవర్లలో 9 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టాడు. ఇప్పుడు అదే వేదికపై తిరిగి అంతర్జాతీయ టీ20 బరిలోకి దిగే అవకాశం దక్కింది. అక్టోబర్ 22 నుంచి న్యూజిలాండ్‌తో ప్రారంభమయ్యే టీ20 సిరీస్‌కు కూడా అతడిని ఎంపిక చేశారు. అర్ష్‌దీప్ కోలుకుంటున్నాడని, తుది నిర్ణయం మ్యాచ్ రోజున తీసుకుంటామని భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ తెలిపాడు. భువనేశ్వర్ రాకతో యువ బౌలింగ్ విభాగానికి అనుభవం, విలువైన మార్గదర్శనం లభిస్తుందని పేర్కొన్నాడు. ఐపీఎల్ 2025, 2026 సీజన్లలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున 30 మ్యాచ్‌ల్లో 45 వికెట్లు తీసి భువనేశ్వర్ సత్తా చాటాడు. కొత్త బంతితో స్వింగ్ రాబట్టడంతోపాటు ఇన్నింగ్స్ చివర్లో వైవిధ్యమైన బంతులతో వికెట్లు తీయగల అతడి నైపుణ్యం భారత్‌కు ఉపయోగపడనుంది. ఈ సిరీస్‌లో వెస్టిండీస్ కెప్టెన్ షై హోప్ నాలుగు మ్యాచ్‌ల్లో 261 పరుగులతో అత్యధిక పరుగుల వీరుడిగా నిలిచాడు. ఇందులో రెండు శతకాలు ఉన్నాయి. అతడి దూకుడుకు అడ్డుకట్ట వేయడంలో కొత్త బంతితో భువనేశ్వర్ బౌలింగ్ కీలకం కానుంది.

నిలకడలేని ఓపెనర్లు

భారత్ సమస్యలు ఓపెనర్లతోనే మొదలవుతున్నాయి. సంజు శాంసన్, అభిషేక్ శర్మ వ్యక్తిగతంగా మెరుపులు మెరిపించి మూడు అర్ధశతకాలు సాధించినా.. ఓపెనింగ్ జోడీగా వారి స్కోర్లు 29, 42, 7, 60 మాత్రమే. హైదరాబాద్‌లో చివరి మ్యాచ్‌లో 60 పరుగుల భాగస్వామ్యం నమోదైనా.. అందులో శాంసన్ 56 పరుగులు చేయగా, అభిషేక్ కేవలం రెండు పరుగులే చేశాడు. ఆరంభం లభించినప్పటికీ మధ్య వరుస దాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతోంది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తొలి టీ20లో 102 పరుగులతో చెలరేగినా.. ఆ తర్వాతి మూడు మ్యాచ్‌ల్లో 40, 1, 16 పరుగులకే పరిమితమయ్యాడు. ఒత్తిడిలో జట్టును విజయపథంలో నడిపించే సామర్థ్యంపై ఈ మ్యాచ్‌తో అతడికి పరీక్ష ఎదురుకానుంది. ఇషాన్ కిషన్ 43, 37 పరుగులతో మంచి ఆరంభాలు అందుకున్నా.. వాటిని భారీ స్కోర్లుగా మలచలేకపోయాడు. నామన్ ధీర్ వరుసగా 4, 10, 0 పరుగులే చేశాడు. తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి సైతం హైదరాబాద్ మ్యాచ్‌లో కీలక సమయంలో 18 బంతులపాటు ఒక్క బౌండరీ కూడా సాధించలేకపోయారు. 248 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఈ వైఫల్యం భారత్‌పై ఒత్తిడిని పెంచింది. మూడో, నాలుగో టీ20ల్లో బెంచ్‌కే పరిమితమైన కుల్దీప్ యాదవ్.. మధ్య ఓవర్లలో పరుగుల వేగాన్ని కట్టడి చేయగలడు. ఇప్పటివరకు అర్ష్‌దీప్, అక్షర్ పటేల్ బౌలింగ్‌పై ఆధారపడిన భారత్‌కు కుల్దీప్ చేరిక అదనపు బలం కానుంది.

వర్షం ఆటంకం కలిగించకుంటే..

సిరీస్‌ను గెలవడం వెస్టిండీస్‌కు అనూహ్య విజయమే అవుతుంది. కరీబియన్ దీవుల్లో క్రికెట్‌ను పునరుజ్జీవింపజేసేందుకు ఆ దేశ క్రికెట్ బోర్డు ఇటీవల పలు చర్యలను ప్రకటించింది. ఈ నేపథ్యంలో సిరీస్ విజయంతో ఆ జట్టు మరింత ఉత్సాహం పొందనుంది. మరోవైపు, సొంతగడ్డపై భారత్‌పైనే ఎక్కువ ఒత్తిడి ఉంటుంది. చివరికి బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌పై ఏ జట్టు ముందుగా తడబడుతుందన్నదే ఫలితాన్ని నిర్ణయించవచ్చు.

ఒత్తిడిలో తెలివైన నిర్ణయాలు తీసుకోవాలి

• బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్

వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌లో భారీ స్కోర్లు నమోదవుతున్న నేపథ్యంలో భారత బౌలర్లు ఒత్తిడిలో తెలివైన నిర్ణయాలు తీసుకోవాలని బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ సూచించారు. బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌లపై బౌలింగ్ చేయడం సవాలేనని, వరుస మ్యాచ్‌ల కారణంగా సాధనకు సమయం కూడా తక్కువగా ఉంటోందని చెప్పారు. గత మ్యాచ్‌ల నుంచి పాఠాలు నేర్చుకుంటూ ముందుకు సాగాలని, బౌలర్లతో చర్చించి మెరుగుపడాల్సిన అంశాలను గుర్తించినట్లు వెల్లడించారు. యువ బౌలర్లకు ఈ సిరీస్ మంచి అనుభవాన్ని అందించిందని మోర్కెల్ పేర్కొన్నారు. ప్రిన్స్ యాదవ్ తన బలాలను గుర్తించి, సరళమైన విధానంలో బౌలింగ్ చేస్తున్నాడని ప్రశంసించారు. వైట్ బాల్ క్రికెట్‌లో అన్ని దశల్లోనూ బౌలింగ్ చేయగల ఆటగాడిగా అతడు ఎదుగుతున్న తీరు ఆకట్టుకుంటోందని మోర్కెల్ అన్నారు.



ఎస్ బ్యాంక్ ఏటీ–1 బాండ్ల రద్దుపై సుప్రీం షాక్

• రూ.8,415 కోట్ల బాండ్ల రద్దు చెల్లదన్న అత్యున్నత న్యాయస్థానం
• తీర్పును పరిశీలిస్తున్న ఎస్ బ్యాంక్
• తదుపరి చర్యలపై చట్టపరమైన అవకాశాల మదింపు



న్యూఢిల్లీ: ఎస్ బ్యాంక్ అదనపు టైర్–1 (ఏటీ–1) బాండ్ల రద్దు వ్యవహారంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బ్యాంకు క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. తదుపరి చర్యలు, అందుబాటులో ఉన్న చట్టపరమైన అవకాశాలను అంచనా వేస్తున్నట్లు వెల్లడించింది. 2020 మార్చిలో బ్యాంకు పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా రూ.8,415 కోట్ల విలువైన ఏటీ–1 బాండ్లను రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు గురువారం సమర్థించింది. ఈ అంశంపై ఎస్ బ్యాంక్, ఆర్‌బీఐ, కేంద్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీళ్లను కొట్టివేసింది. పునర్‌వ్యవస్థీకరణ పథకంలో స్పష్టమైన నిబంధన లేనప్పుడు ఏటీ–1 బాండ్లను రద్దు చేసే అధికారం నిర్వాహకుడికి ఉండదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. 2023 జనవరి 20న బాంబే హైకోర్టు కూడా ఇదే కారణంతో రద్దు నిర్ణయాన్ని కొట్టివేసింది. ఆర్‌బీఐ జారీ చేసిన తుది పునర్‌వ్యవస్థీకరణ పథకంలో బాండ్ల రద్దుకు అనుమతి లేదని పేర్కొంది. అయితే అప్పీళ్లకు అవకాశం కల్పిస్తూ తన తీర్పు అమలును అప్పట్లో నిలిపివేసింది.

పెట్టుబడిదారులపై వైఫల్యాల భారం మోపడం అన్యాయం

బ్యాంకు పరిపాలనా వైఫల్యాల భారాన్ని పెట్టుబడిదారులపై మోపడం అన్యాయమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. యెస్ బ్యాంక్ మూలధన నిష్పత్తి (సీఈటీ1) 0.6 శాతానికి పడిపోయే పరిస్థితి ఏర్పడినా, ఆర్‌బీఐ, బ్యాంకు మాస్టర్ సర్క్యులర్ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించి ఉంటే పెట్టుబడిదారులకు నష్టం నివారించే అవకాశం ఉండేదని పేర్కొంది. బ్యాంకులో గతంలోనే అవకతవకలు గుర్తించారని, సిబ్బందిపై క్రిమినల్ కేసులు నమోదయ్యాయని గుర్తుచేసింది. ఏటీ–1 బాండ్లు బ్యాంకుల మూలధన సమీకరణకు ఉపయోగపడే శాశ్వత రుణ సాధనాలు. వీటిలో రిస్క్ ఎక్కువగా ఉండటంతో వడ్డీ కూడా అధికంగా ఉంటుంది. బ్యాంకు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడినప్పుడు నిబంధనల ప్రకారం వీటిని రద్దు చేసే అవకాశం ఉంటుంది. ఇదిలాఉంటే సుప్రీం తీర్పును పరిశీలిస్తున్నప్పటికీ, వృద్ధి లక్ష్యాల సాధనకు అవసరమైన మూలధన నిర్వహణ మార్గాలు అందుబాటులో ఉన్నాయని యెస్ బ్యాంక్ తెలిపింది. అవసరమైతే అదనపు మూలధన చర్యలు చేపట్టే వెసులుబాటు ఉందని పేర్కొంది. వినియోగదారులకు అన్ని బ్యాంకింగ్ సేవల్లో నిరంతర మద్దతు అందించడంతోపాటు, వ్యాపార పునాదులను మరింత బలోపేతం చేయడంపై దృష్టి కొనసాగిస్తామని నియంత్రణ సంస్థకు సమర్పించిన ప్రకటనలో వెల్లడించింది.

పోటీకి మేం భయపడం

• స్టార్‌లింక్ ప్రవేశాన్ని మేం వ్యతిరేకించడం లేదు • ఉపగ్రహ సమాచార సేవల రంగంలోకి వచ్చే సంస్థలన్నింటినీ స్వాగతిస్తున్నాం • జియో శాటిలైట్ సేవలకూ ఇంకా అనుమతులు రావాలి • దేశీయ, విదేశీ సంస్థలకు ఒకే నిబంధనలు • పదేళ్లలో జియో 53 కోట్లకు పైగా వినియోగదారుల సంపాదించింది • చట్టాలకు లోబడే ప్రతి సంస్థా పనిచేయాలి • మస్క్ ఆరోపణలకు రిలయన్స్ దీటైన సమాధానం



ముంబై: భారత ఉపగ్రహ ఇంటర్నెట్ మార్కెట్‌లో పోటీని అడ్డుకుంటున్నారంటూ ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ చేసిన ఆరోపణలకు రిలయన్స్ ఇండస్ట్రీస్ దీటుగా స్పందించింది. భారత్‌లో స్టార్‌లింక్ ప్రవేశాన్ని తాము వ్యతిరేకించడం లేదని, ఉపగ్రహ సమాచార సేవల రంగంలోకి వచ్చే సంస్థలన్నింటినీ స్వాగతిస్తున్నామని స్పష్టం చేసింది. పోటీకి భయపడే ప్రసక్తే లేదని, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు పోటీని ఒక అవకాశంగా భావిస్తామని పేర్కొంది. ఈ మేరకు శుక్రవారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. భారత మార్కెట్, రిలయన్స్‌పై ఇటీవల వచ్చిన వ్యాఖ్యల నేపథ్యంలో కొన్ని వాస్తవాలను తెలియజేయాలనుకుంటున్నామని సంస్థ పేర్కొంది. ప్రజల జీవితాలను మెరుగుపరిచే దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడులు, సాంకేతిక ఆవిష్కరణలకు భారత్ ఎప్పుడూ స్వాగతం పలుకుతోందని తెలిపింది. పారదర్శకమైన వ్యాపార వాతావరణానికి చట్టబద్ధమైన పాలన కీలకమని వివరించింది. భారత ప్రభుత్వం అనుసరిస్తున్న అనుమతుల విధానం దేశీయ, విదేశీ సంస్థలన్నింటికీ సమానంగా వర్తిస్తోందని స్పష్టం చేసింది. జియో ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలకు కూడా ఇంకా ప్రభుత్వ అనుమతులు రావాల్సి ఉందని వెల్లడించింది. టెలికాం రంగంలోకి అడుగుపెట్టినప్పటి నుంచి పోటీని ఎప్పుడూ భయపడలేదని రిలయన్స్ తెలిపింది. వినియోగదారులకు ఎవరు మెరుగైన సేవలు అందించగలరో నిరూపించుకునేందుకు పోటీ ఒక పరీక్షగా నిలుస్తుందని పేర్కొంది. 2016లో తీవ్ర పోటీ ఉన్న టెలికాం మార్కెట్లో కొత్త సంస్థగా ప్రవేశించిన జియో.. పదేళ్లలోనే 53 కోట్లకు పైగా వినియోగదారుల విశ్వాసాన్ని పొందిందని గుర్తుచేసింది. దేశవ్యాప్తంగా అందుబాటు ధరల్లో డేటా సేవలు అందించడంతోపాటు అత్యుత్తమ డిజిటల్ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశామని వివరించింది. స్టార్‌లింక్ ఒక్కటే కాకుండా ఉపగ్రహ సమాచార సేవల రంగంలోకి వచ్చే ప్రతి సంస్థనూ స్వాగతిస్తామని, జియో సహా అన్ని కంపెనీల లక్ష్యం భారత ప్రజలకు సేవలందించడమే కావాలని పేర్కొంది. అయితే దేశంలో కార్యకలాపాలు నిర్వహించే ఏ సంస్థ అయినా భారత చట్టాలు, నిబంధనలకు కట్టుబడి ఉండాల్సిందేనని స్పష్టం చేసింది.

మస్క్ ఆరోపణలతో వివాదం

భారత్‌లో స్టార్‌లింక్ సేవల ప్రారంభానికి అవసరమైన అనుమతులు ఇంకా పూర్తికాకపోవడంతో మస్క్ ఇటీవల 'ఎక్స్' వేదికగా స్పందించారు. కొందరు వ్యాపారవేత్తలు తమ ప్రయోజనాల కోసం స్టార్‌లింక్ ప్రవేశాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీని ఉద్దేశించి 'ప్రధాని అంబానీ' అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. భారత ఇంటర్నెట్ మార్కెట్లో పోటీకి అవకాశం కల్పించాలని కోరారు. మారుమూల ప్రాంతాల్లో ఇంటర్నెట్ సదుపాయం లేని విద్యార్థులకు విద్యా అవకాశాలు, చిన్న వ్యాపారులకు ప్రపంచ మార్కెట్లలో విక్రయాల అవకాశాలను స్టార్‌లింక్ మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు. అయితే, దేశంలో అనుమతుల ప్రక్రియలో ఎలాంటి వివక్ష లేదని, నిబంధనలు అందరికీ సమానంగా వర్తిస్తాయని కేంద్రం స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా, భారతి ఎంటర్‌ప్రైజెస్ అధినేత సునీల్ భారతీ మిట్టల్ సైతం అనుమతుల అంశంపై స్పందించారు. తమ సంస్థ ఐదేళ్ల క్రితమే అనుమతుల కోసం దరఖాస్తు చేసుకుందని, మూడేళ్లుగా భూసంబంధిత నెట్‌వర్క్ సిద్ధంగా ఉందని తెలిపారు. తమ ఉపగ్రహాలు ఐదేళ్లుగా భారత్ మీదుగా ప్రయాణిస్తున్నప్పటికీ అనుమతులు లభించలేదన్నారు. మస్క్ కంటే కొన్ని రోజుల ముందైనా అనుమతి వస్తే సంతోషిస్తామని వ్యాఖ్యానించారు.

రెండోరోజూ లాభాల్లో సూచీలు

• 414 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
• 23,146.15 వద్ద ముగిసిన నిఫ్టీ
• ఊరటనిచ్చిన ఐటీ షేర్ల కొనుగోళ్లు, ముడిచమురు ధరల తగ్గుదల



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండో రోజూ లాభాల్లో ముగిశాయి. ఐటీ షేర్లలో భారీ కొనుగోళ్లు, అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు, ముడిచమురు ధరల తగ్గుదల సూచీలకు ఊతమిచ్చాయి. శుక్రవారం బీఎస్ఈ సెన్సెక్స్ 413.66 పాయింట్లు (0.56 శాతం) పెరిగి 74,729.27 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 463.17 పాయింట్లు ఎగబాకి 74,778.78 స్థాయిని తాకింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 148.80 పాయింట్లు (0.65 శాతం) లాభంతో 23,146.15 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లో టెక్ మహీంద్రా 8.45 శాతం లాభంతో అగ్రస్థానంలో నిలిచింది. రెండో త్రైమాసికంలో కంపెనీ నికర లాభం 32.74 శాతం పెరిగి రూ.1,585.6 కోట్లకు చేరడం ఇందుకు ప్రధాన కారణమైంది. టీసీఎస్ 4.61 శాతం, ఇన్ఫోసిస్ 4.55 శాతం, హెచ్‌సీఎల్ టెక్ 1.08 శాతం చొప్పున పెరిగాయి. భారతీ ఎయిర్‌టెల్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్ కూడా లాభపడ్డాయి. మరోవైపు ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఏషియన్ పెయింట్స్, భారత్ ఎలక్ట్రానిక్స్ నష్టాలను చవిచూశాయి. రంగాలవారీగా బీఎస్ఈ ఐటీ సూచీ 3.38 శాతం, ఫోకస్డ్ ఐటీ సూచీ 3.29 శాతం పెరిగాయి. టెలికాం, మెటల్, ఆటో, కమోడిటీస్, ప్రభుత్వ రంగ బ్యాంకుల సూచీలు 0.55–1.56 శాతం మధ్య లాభపడ్డాయి. హౌసింగ్ ఫైనాన్స్ 1.19 శాతం నష్టపోగా, ఆస్పత్రులు, సేవలు, ఇంధనం, వినియోగ వస్తువులు, ఎఫ్ఎంసీజీ రంగాలూ తగ్గాయి. మిడ్‌క్యాప్ సెలెక్ట్ 0.37 శాతం, స్మాల్‌క్యాప్ సెలెక్ట్ 0.14 శాతం పడిపోయాయి. బీఎస్ఈలో 2,404 షేర్లు లాభపడగా, 1,962 నష్టపోయాయి. మరో 250 షేర్లలో మార్పు లేదు. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ ముడిచమురు ధర 0.30 శాతం తగ్గి బ్యారెల్‌కు 105.6 డాలర్లకు చేరింది. రూపాయి బలపడటం కూడా మార్కెట్‌కు కలిసొచ్చింది. అయితే విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు గురువారం రూ.5,285.37 కోట్ల విలువైన షేర్లను నికరంగా విక్రయించారు. అయినప్పటికీ ఐటీ కంపెనీల త్రైమాసిక ఫలితాలు, యాజమాన్యాల సానుకూల అంచనాలు పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచాయి. స్టాక్ మార్కెట్ల ముగింపు వేళల సెషన్ విధానంలో సెబీ కీలక సవరణలు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం ప్రతి ట్రేడింగ్ రోజూ మధ్యాహ్నం 3.30 నుంచి 3.40 గంటల వరకు ముగింపు వేళం కొనసాగుతుంది.

కొత్త బ్రాండ్ గుర్తింపుతో ఐసీఐసీఐ లైఫ్

• 'హర్ కల్ ఆసాన్' నినాదం ఆవిష్కరణ
• 7.37 కోట్ల మందికి బీమా రక్షణ

ముంబై: ఐసీఐసీఐ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ (గతంలో ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్) కొత్త బ్రాండ్ గుర్తింపుతో పాటు 'హర్ కల్ ఆసాన్' (ప్రతి రేపూ సులభం) నినాదాన్ని ఆవిష్కరించింది. జీవిత బీమా సేవలను మరింత సరళంగా, పారదర్శకంగా, సౌకర్యవంతంగా అందించడం, వినియోగదారులు భవిష్యత్తు ఆర్థిక ప్రణాళికలను విశ్వాసంతో రూపొందించుకునేలా చేయడం దీని లక్ష్యమని సంస్థ తెలిపింది. గత 25ఏళ్లలో 20 కోట్ల మందికి పైగా భారతీయుల ఆర్థిక భద్రతకు తోడ్పడ్డామని సంస్థ మార్కెటింగ్, డిజిటల్, బ్యాంకా ష్యూరెన్స్ విభాగాల అధిపతి శ్రీనివాస్ బాలసుబ్రమణియన్ తెలిపారు. మారుతున్న జీవనశైలి, కుటుంబ అవసరాలకు అనుగుణంగా బీమా సేవలను మెరుగుపరుస్తామని, 2047 నాటికి అందరికీ బీమా అందించాలన్న జాతీయ లక్ష్యానికి తోడ్పడతామని పేర్కొన్నారు. 2026 మార్చి 31 నాటికి సంస్థ 7.373 కోట్ల జీవితాలకు బీమా రక్షణ కల్పిస్తోంది.

హీరోతో కలిస్తేనే హీరోయిన్ పాత్ర

సక్సెస్ అయినట్లు కాదు



'కరికాల' ప్రారంభోత్సవంలో సందీప్ కిషన్ ఆసక్తికర వ్యాఖ్యలు.. నటీమణుల పాత్రలకు ప్రాధాన్యమివ్వాలని సూచన యంగ్ హీరో సందీప్ కిషన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ పాన్ ఇండియా ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం 'కరికాల' తాజాగా పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. 'శంబాల' చిత్రంతో గుర్తింపు తెచ్చుకున్న యుగంధర్ ముని ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. సైనింగ్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రంలో కేథరిన్ థ్రెస్సా, సాక్షి అగర్వాల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అయితే సినిమా ప్రారంభోత్సవం సందర్భంగా హీరోయిన్ల పాత్రలపై చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి. సినిమాల్లో కథానాయిక పాత్రలను కేవలం క్లైమాక్స్‌లో హీరోతో కలుస్తుందా? లేదా? అనే అంశం ఆధారంగా అంచనా వేయడం సరికాదని సందీప్ కిషన్ అభిప్రాయపడ్డారు. కథలో హీరోయిన్ పాత్రకు ఉన్న ప్రాధాన్యత, ఆమె నటన, కథను మలుపు తిప్పడంలో పోషించిన పాత్ర ఆధారంగానే నటీమణుల ప్రతిభను అంచనా వేయాలని పేర్కొన్నారు. సినిమా చివర్లో హీరోతో కలిస్తేనే ఆ పాత్ర విజయవంతమైనట్లు భావించే పాత ఆలోచనా విధానాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. హీరోతో విడిపోతే ఆ పాత్ర బాగోలేదని, కథలో హీరోయిన్ మోసం చేస్తే ఆ పాత్రకు విలువ లేదని నిర్ణయించడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. నటీమణుల ప్రతిభను, వారు ఎంచుకునే విభిన్నమైన పాత్రలను గౌరవించాలని సూచించారు. సంప్రదాయ ముగింపుల ఆధారంగా కథానాయికల పాత్రలను తక్కువ చేసి చూడకూడదనే సందేశాన్ని ఆయన ఇచ్చారు. ఇక 'కరికాల' చిత్రాన్ని రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి చిత్ర బృందం ప్రణాళికలు సిద్ధం చేసింది. తొలి భాగం 'కరికాల: చాప్టర్ 1'ను 2027 జులై 2న, రెండో భాగం 'కరికాల: చాప్టర్ 2'ను అదే ఏడాది అక్టోబర్ 28న విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

400 కుటుంబాలకు

రష్మిక చేయూత



నేషనల్ క్రష్ రష్మిక మందన్న తన సేవా కార్యక్రమంతో అందరి దృష్టిని ఆకర్షించారు. తన కొత్త చిత్రం 'రణబాలి'లోని జయమ్మ పాత్ర స్ఫూర్తితో 'అన్నపూర్ణ' పేరుతో ప్రత్యేక సేవా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ఎనిమిది వేర్వేరు ప్రాంతాలకు చెందిన 400 కుటుంబాలకు మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను అందించారు. ఈ కార్యక్రమాన్ని ఏడాది పాటు కొనసాగించనున్నట్లు రష్మిక వెల్లడించారు. రష్మిక చేపట్టిన ఈ కార్యక్రమంపై నటుడు విజయ్ దేవరకొండ సంతోషం వ్యక్తం చేశారు. ఆమెను చూస్తుంటే గర్వంగా ఉందంటూ ప్రశంసించారు. దీనిపై రష్మిక స్పందిస్తూ.. జయమ్మ పాత్రకు తనకు కొన్ని పోలికలు ఉన్నాయని, అభిమానులు తనపై చూపిస్తున్న ప్రేమకు కృతజ్ఞతగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నానని తెలిపారు. ఇప్పటివరకు ఈ విషయాలను బయటకు చెప్పలేదని, తనకు, తన బృందానికి తెలిస్తే చాలనుకున్నానని పేర్కొన్నారు. అయితే తన సేవా కార్యక్రమం మరికొందరికి స్ఫూర్తిగా నిలవాలనే ఉద్దేశంతోనే ఇప్పుడు వెల్లడిస్తున్నట్లు రష్మిక చెప్పారు. ప్రస్తుతం 400 కుటుంబాలకు అండగా నిలిచానని, ప్రతి మూడు నెలలకు ఒకసారి నిత్యావసర సరుకులు అందిస్తూ ఏడాది పొడవునా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తానని వివరించారు. ఈ సహాయంతో కుటుంబాలు నిత్యావసరాల కోసం ఖర్చు చేసే డబ్బును పొదుపు చేసుకుని భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకోగలవని ఆశిస్తున్నట్లు తెలిపారు. రష్మిక చేపట్టిన ఈ కార్యక్రమంపై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.

అమీర్ ఖాన్ మేనల్లుడికి ముంబై పోలీసుల నోటీసులు

బాలీవుడ్ నటుడు, అమీర్ ఖాన్ మేనల్లుడు ఇమ్రాన్ ఖాన్‌కు ముంబై పోలీసులు నోటీసులు జారీ చేశారు. అమెరికా పౌరుడైన ఆయన అక్టోబర్ 28లోగా భారత్ విడిచి వెళ్లాలని ఆదేశించారు. ముంబైలో ఇటీవల జరిగిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసన కార్యక్రమంలో పాల్గొన్న నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. విదేశీ పౌరుడిగా ఉండి దేశీయ రాజకీయ ఆందోళనల్లో పాల్గొనడం నిబంధనలకు విరుద్ధమని అధికారులు పేర్కొన్నట్లు వార్తా కథనాలు తెలిపాయి. ముంబైలోని ఆగస్టు క్రాంతి మైదానంలో అక్టోబర్ 10న ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ సీజేపీ, ఇతర సంఘాలు నిరసన చేపట్టాయి. ఈ కార్యక్రమంలో ఇమ్రాన్ ఖాన్ కూడా పాల్గొన్నారు. నిరసన సందర్భంగా పోలీసులు పలువురిని అదుపులోకి తీసుకోగా, వారిలో ఇమ్రాన్ కూడా ఉన్నారు. అనంతరం



ఆయనను విడుదల చేశారు. ఇమ్రాన్ అమెరికా పౌరసత్వంతో పాటు ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) హోదా కలిగి ఉన్నట్లు కథనాలు పేర్కొన్నాయి. ఈ ఘటన అనంతరం విదేశీ పౌరుల రాజకీయ కార్యకలాపాలపై నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణలతో అధికారులు ఆయనకు భారత్ విడిచి వెళ్లాలని నోటీసు ఇచ్చారు. గడువులోగా దేశం విడిచి వెళ్లకపోతే తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

మరో 'శంకరాభరణం' అవుతుంది

తన అమృత గానంతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది శ్రోతలను అలరించిన సంగీత సామ్రాజ్ఞి భారతరత్న ఎంఎస్ సుబ్బులక్ష్మి జీవిత కథ వెండితెరపై ఆవిష్కృతం కానుంది. 'భారతరత్న ఎంఎస్ సుబ్బులక్ష్మి' పేరుతో రూపొందుతున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన నటి రష్మిక మందన్న టైటిల్ పాత్ర పోషిస్తున్నారు. ప్రముఖ నిర్మాతలు అల్లు అరవింద్, రాక్‌లైన్ వెంకటేష్, బన్నీ వాస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, ప్రతిభావంతుడైన దర్శకుడు గౌతమ్ తిన్ననూరి తెరకెక్కిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతాన్ని అందిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ప్రారంభోత్సవం లెజెండరీ నటుడు కమల్‌హాసన్ చేతుల మీదుగా ఘనంగా జరిగింది. తాజాగా సూపర్‌స్టార్ రజనీకాంత్ నుంచి కూడా ఈ చిత్రానికి ప్రశంసలు లభించాయి. ఇటీవల జరిగిన 'జైలర్–2' సినిమా వేడుకలో రజనీకాంత్ ఈ ప్రాజెక్ట్‌పై తన అభిప్రాయాలను పంచుకున్నారు. 'భారతరత్న ఎంఎస్ సుబ్బులక్ష్మి' సినిమా తెరకెక్కుతుండటం ఎంతో సంతోషంగా ఉందని, ఈ చిత్రం మరో 'శంకరాభరణం'లా



నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందిస్తుండటంపై కూడా రజనీకాంత్ సంతోషం వ్యక్తం చేశారు. వెండితెరపై ఈ చిత్రాన్ని వీక్షించేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. దీంతో ఎంఎస్ సుబ్బులక్ష్మి జీవిత కథ ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంపై ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరిగింది. రష్మిక తన నటనతో సంగీత సామ్రాజ్ఞి జీవితాన్ని ఏ విధంగా ఆవిష్కరిస్తారోనని సినీ అభిమానులు ఎదురుచూస్తున్నారు.

ఇండస్ట్రీ నన్ను గుర్తించకపోయినా..

ప్రేక్షకులు ఆదరిస్తున్నారు



ఉత్తరాంధ్ర జానపద కళారూపమైన బుర్రకథను ప్రజల్లోకి తీసుకెళ్లిన ప్రముఖ కళాకారిణి గరివిడి లక్ష్మి జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'గరివిడి లక్ష్మి'. యంగ్ హీరోయిన్ ఆనంది ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ఆనంది చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. సినిమా పరిశ్రమలో ఎదురయ్యే పరిస్థితుల గురించి ఆమె భావోద్వేగానికి గురయ్యారు. సినిమా రంగానికి తాను సరిపోతానో లేదోనని కొన్నిసార్లు అనిపిస్తుందని ఆనంది తెలిపారు. ఇక్కడ సినిమాలు చేయడానికి ఎన్నో లెక్కలు, రాజకీయాలు ఉంటాయని, అనేక పరిణామాలు చోటుచేసుకుంటాయని పేర్కొన్నారు. అసలు సినిమాలు ఎందుకు చేస్తున్నాననే ప్రశ్న తనలో తలెత్తిన సందర్భాల్లో ప్రేక్షకుల ప్రేమ, మద్దతే తనను ముందుకు నడిపిస్తున్నాయని భావోద్వేగంగా చెప్పారు. తనకు అండగా నిలుస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పరిశ్రమ తనను గుర్తించినా, గుర్తించకపోయినా ప్రేక్షకులు మాత్రం తన నటనను గుర్తుంచుకుంటున్నారని ఆనంది పేర్కొన్నారు. తాను పోషించిన పాత్రలను అభిమానులు గుర్తుచేసుకుంటూ, తనకు అవార్డులు రావాలని కోరుకోవడం ఎంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు. ప్రేక్షకుల నుంచి లభిస్తున్న ఆదరణే తనకు దక్కిన అతిపెద్ద గౌరవమని చెప్పారు. తనపై ప్రేమాభిమానాలు చూపిస్తున్న వారికి ఎప్పటికీ రుణపడి ఉంటానంటూ వేదికపైనే భావోద్వేగానికి లోనయ్యారు. ఆనంది వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చకు దారితీశాయి.

రజనీ స్వాగ్.. యాక్షన్ హోరు!



సూపర్‌స్టార్ రజనీకాంత్, దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ కలయికలో రూపొందిన ప్రతిష్ఠాత్మక చిత్రం 'జైలర్ 2' భారీ అంచనాల మధ్య ప్రేక్షకుల ముందుకు వచ్చింది. యాక్షన్, భావోద్వేగాలు, స్టైలిష్ ఎలివేషన్లు, భారీ తారాగణంతో తెరకెక్కిన ఈ సీక్వెల్ రజనీ అభిమానులను ఆకట్టుకునేలా ఉంది. టైగర్ ముత్తువేల్ పాండియన్‌గా రజనీకాంత్ మరోసారి తనదైన శైలిలో అలరించగా, కీలక పాత్రల్లో నటించిన ఇతర నటీనటులు కూడా సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అయితే కొన్ని చోట్ల నెమ్మదించిన కథనం, భావోద్వేగాలు పూర్తిస్థాయిలో ప్రేక్షకులకు చేరకపోవడం ప్రతికూలంగా మారాయి.

సినిమా పేరు: జైలర్ 2, నటీనటులు: రజనీకాంత్, ఎస్.జె. సూర్య, మిథున్ చక్రవర్తి, సూరజ్ వెంజరమూడు, రమ్యకృష్ణ, విద్యాబాలన్ తదితరులు, దర్శకత్వం: నెల్సన్ దిలీప్‌కుమార్, నిర్మాత: కళానిధి మారన్, సంగీతం: అనిరుధ్ రవిచందర్, ఛాయాగ్రహణం: విజయ్ కార్తిక్ కన్నన్, కూర్పు: ఆర్. నిర్మల్, రేటింగ్: 3/5. కథ విషయానికి వస్తే.. రిటైర్డ్ పోలీసు అధికారి టైగర్ ముత్తువేల్ పాండియన్ (రజనీకాంత్) ఓ సూపర్ మార్కెట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తూ కుటుంబంతో ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతుంటాడు. మరోవైపు వర్మను హతమార్చిన వ్యక్తి కోసం ఎస్.జె. సూర్య కుటుంబం అన్వేషణ కొనసాగిస్తుంది. ఈ క్రమంలో చోటుచేసుకున్న నాటకీయ పరిణామాలతో ముత్తువేల్ పాండియన్ మరోసారి సమస్యల్లో చిక్కుకుంటాడు. పురాతన విగ్రహాల చుట్టూ అల్లుకున్న వ్యవహారం మరింత సంక్లిష్టంగా మారడంతో కుటుంబాన్ని కాపాడటంతో పాటు విగ్రహాలను రక్షించేందుకు టైగర్ మళ్లీ రంగంలోకి దిగాల్సి వస్తుంది. టైగర్ అసలు స్వరూపం గురించి నిజాలు బయటపడిన తర్వాత కాంత (విద్యాబాలన్) కుటుంబం ఏం చేసింది? తమ నుంచి చేజారిన విగ్రహాలను తిరిగి దక్కించుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేసింది? వారి పన్నాగాల నుంచి టైగర్ ఎలా బయటపడ్డాడు? తన బృందం సహాయంతో కల్పక్ కుటుంబాన్ని ఎలా ఎదుర్కొన్నాడు? చివరికి కాంత టైగర్‌కు ఎలాంటి సవాల్ విసిరింది? అన్నది మిగతా కథ. ఇక ప్లస్ పాయింట్ల విషయానికి వస్తే.. టైగర్ ముత్తువేల్ పాండియన్‌గా రజనీకాంత్ తనదైన నటనతో ఆకట్టుకున్నారు. పవర్‌ఫుల్ యాక్షన్ సన్నివేశాలతో పాటు భావోద్వేగభరిత ఘట్టాల్లోనూ తన అనుభవాన్ని చూపించారు. పరిస్థితులకు అనుగుణంగా పాత్రలో వేరియేషన్లు ప్రదర్శించిన తీరు బాగుంది. ముఖ్యంగా తన కొడుకు విషయంలో తాను చేసిన పనులు కుటుంబానికి తెలిసే సందర్భంలో రజనీ నటన ప్రత్యేకంగా నిలుస్తుంది. ఆయన బాడీ లాంగ్వేజ్, స్టైలిష్ లుక్స్, యాక్షన్ సన్నివేశాల్లో చూపించిన హావభావాలు అభిమానులను అలరిస్తాయి. ఫ్లాష్‌బ్యాక్ ఘట్టాల్లోనూ తనదైన ముద్ర వేశారు. మరోవైపు అతిథి పాత్రల్లో కనిపించిన హృతిక్ రోషన్, మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, జాకీ ష్రాఫ్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చివర్లో విజయ్ సేతుపతి ఎంట్రీ ఆసక్తిని పెంచుతుంది. కీలక పాత్రలో ఎస్.జె. సూర్య తన నటనతో మెప్పించగా, తల్లి పాత్రలో రమ్యకృష్ణ ఒదిగిపోయారు. పూర్ణ ప్రత్యేక గీతం ఆకట్టుకుంటుంది. యోగిబాబుతో పాటు ఇతర నటీనటులు తమ పాత్రల పరిధిలో చక్కగా నటించారు. దర్శకుడు నెల్సన్ రూపొందించిన యాక్షన్ సన్నివేశాలు సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తాయి. ముఖ్యంగా ప్రీ క్లైమాక్స్, క్లైమాక్స్‌లో వచ్చే పోరాట ఘట్టాలు ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉన్నాయి. ఆ సన్నివేశాల్లో రజనీకాంత్ తెరపై కనిపించే తీరు, ఇతర నటీనటుల నటన సినిమాకు అదనపు బలాన్ని అందించాయి. భారీ ఎలివేషన్లు, ప్రత్యేక పాత్రల ప్రవేశాలు, మూడో భాగంపై ఆసక్తిని పెంచేలా ఇచ్చిన సంకేతం కూడా బాగుంది. అయితే మైనస్ పాయింట్ల విషయానికి వస్తే.. టైగర్ పాత్రను, దానికి సంబంధించిన యాక్షన్ సన్నివేశాలను దర్శకుడు బాగా రూపొందించినప్పటికీ, కథనం విషయంలో కొన్ని చోట్ల మరింత శ్రద్ధ పెట్టాల్సింది. తొలి భాగం వేగంగా సాగినప్పటికీ, ద్వితీయార్ధంలో కొన్ని సన్నివేశాలు నెమ్మదిగా సాగుతాయి. గత చిత్రాల్లో కనిపించిన నెల్సన్ శైలి ఇందులోనూ కొనసాగింది. కుటుంబ భావోద్వేగాలు కొన్ని చోట్ల ప్రేక్షకులకు చేరువైనా, మాస్ ప్రేక్షకులకు అవే సన్నివేశాలు అంతగా నచ్చకపోవచ్చు. కథలో బలమైన సంఘర్షణ, భావోద్వేగాలకు అవకాశం ఉన్నప్పటికీ, వాటిని కొన్ని సందర్భాల్లో పూర్తిస్థాయిలో స్థాపించలేకపోయారు. దీంతో ప్రేక్షకులు కథలో పూర్తిగా లీనమయ్యే సందర్భాలు తగ్గుతాయి. భారీ ఎలివేషన్లు, స్టార్ నటుల ప్రత్యేక పాత్రలు ఆకట్టుకున్నా, కథనం కొన్ని చోట్ల ముందే ఊహించగలిగేలా సాగుతుంది. కొన్ని సన్నివేశాల్లో కొత్తదనం కొరవడిన భావన కలుగుతుంది. ముఖ్యంగా ద్వితీయార్ధంలోని సాగతీతను తగ్గించి ఉంటే సినిమా మరింత ఆసక్తికరంగా ఉండేది. సాంకేతిక విభాగం విషయానికి వస్తే.. దర్శకుడిగా నెల్సన్ దిలీప్‌కుమార్ తన బాధ్యతను సమర్థంగా నిర్వహించినప్పటికీ, రచయితగా కథనం విషయంలో మరింత శ్రద్ధ పెట్టాల్సింది. యాక్షన్ సన్నివేశాలు, ఎలివేషన్లను బాగా రూపొందించినా, భావోద్వేగాలను బలంగా అనుసంధానించడంలో కొన్ని లోపాలు కనిపిస్తాయి. అనిరుధ్ రవిచందర్ అందించిన సంగీతం సినిమాకు చక్కగా సరిపోయింది. ముఖ్యంగా కొన్ని సన్నివేశాల్లో నేపథ్య సంగీతం ప్రభావవంతంగా ఉంది. విజయ్ కార్తిక్ కన్నన్ ఛాయాగ్రహణం చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. ప్రతి సన్నివేశాన్ని తెరపై అందంగా ఆవిష్కరించారు. ఆర్. నిర్మల్ కూర్పు బాగున్నప్పటికీ, ద్వితీయార్ధంలోని కొన్ని సాగతీత సన్నివేశాలను కుదించి ఉంటే మరింత బాగుండేది. కళానిధి మారన్ నిర్మాణ విలువలు ఉన్నతంగా ఉన్నాయి. భారీ తారాగణం, యాక్షన్ ఘట్టాలు, విజువల్స్ కోసం చేసిన ఖర్చు తెరపై కనిపిస్తుంది. మొత్తంగా 'జైలర్ 2'లో రజనీకాంత్ స్వాగ్, నెల్సన్ మార్క్ డార్క్ హ్యూమర్, భారీ తారాగణం, స్టైలిష్ యాక్షన్ సన్నివేశాలు ప్రధాన ఆకర్షణలు. రజనీ అభిమానులకు ఆయన తెరపై కనిపించే తీరు, ఎలివేషన్లు మంచి అనుభూతిని అందిస్తాయి. అయితే సాధారణంగా సాగే కథనం, నెమ్మదించిన ద్వితీయార్ధం, పూర్తిస్థాయిలో ప్రేక్షకులకు చేరని భావోద్వేగాలు సినిమాకు ప్రతికూలంగా మారాయి. మొత్తంగా యాక్షన్, స్టార్ పవర్, భావోద్వేగాలను ఆస్వాదించే ప్రేక్షకులకు 'జైలర్ 2' ఓ మోస్తరు వినోదాన్ని అందిస్తుంది. **రేటింగ్: 3/5.**

Published and Editor Owned by Adula Thirupathi, and Printed by vattemula Rama krishna, RK Printers Mig 11, Block No 16, Ground Floor 4, Baghlingampally, Hyderabad 500044. Telangana State. and Published from 16-11-13/A, saleemnagar colony, Malakpet, Rangareddy, Telangana State. **Editor: Adula Thirupathi. RNI NO : TGTEL/25/A4244** Email: prajanaava@gmail.com. Phone No: 99484 33277